

ఇదేం పద్ధతి!

- జెడ్పీ సమావేశం బహిష్కరించిన వైసీపీ సభ్యులపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- రైతు, ప్రజా సమస్యలు మీకు పట్టవా అంటూ మండిపాటు
- ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఇదంతా అంటూ ఆరోపణలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వైసీపీ సభ్యులు ప్రవర్తించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే బహిష్కరించినట్లు ప్రకటించి బయటకు వెళ్లిపోవడం రాజకీయ ఎత్తుగడలో భాగమనే వాదన వినపడుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జెడ్పీ సర్వసభ్య సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్‌తో సహా సభ్యులంతా అధికారులపై విరుచుకు పడుతున్నారు. గురువారం సమావేశంలో తమకు గౌరవ వేతనం రెండు సంవత్సరాలుగా ఇవ్వడం లేదనే అంశాన్ని ప్రధాన కారణంగా చూపి సభ్యులు సమావేశాన్ని బహిష్కరించడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని కొందరు సభ్యులు చెప్పకనే చెబుతున్నారు.

ముందస్తు ప్రణాళిక ప్రకారమేనా!

ఉమ్మడి జిల్లాలోని 16 అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులే గెలుపొందారు. దీంతో వైసీపీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని వేదికగా చేసుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు. జెడ్పీ సమావేశాలు జరిగిన ప్రతిసారి ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా గత మూడు విడతలుగా జరిగిన సమావేశాల్లోనూ ప్రభుత్వ విధానాలను, అధికారులను విమర్శిస్తూ వచ్చారు. గురువారం సమావేశంలోనూ ముందస్తు ప్రణాళిక ప్రకారమే సమావేశాన్ని సభ్యులు బహిష్కరించడం గమనార్హం.

ప్రజా సమస్యలు పట్టవా!

ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పంట కాలువలకు సాగు నీటిని విడుదల చేసే తేదీపై ఈ సమావేశంలో చర్చించి, ప్రభుత్వానికి తెలియజేయాలి. రైతులకు ఎరువులు, విత్తనాల పంపిణీ, కౌలు రైతులకు పంట రుణాల మంజూరులో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇతరత్రా రైతులు మిగతా 4లో..



జెడ్పీ సమావేశంలో పోడియం ఎదుట ఆందోళన చేస్తున్న సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో కృష్ణా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, ఇన్‌చార్జి జెడ్పీ సీఈవో ఆనంద్‌కుమార్

బహిష్కరణ

జెడ్పీ సమావేశం నుంచి సభ్యులు వాకౌట్

- కనీస గౌరవం, రెండేళ్లుగా గౌరవ వేతనం ఇవ్వడంలేదని ఆందోళన
- బయటకు వెళ్లిపోయిన సభ్యులతో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో చర్చలు
- తిరిగి రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

జిల్లా పరిషత్ సమావేశం సభ్యుల నినాదాలతో హోరెత్తింది. గ్రామాల్లో అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వడంలేదని, రెండేళ్లుగా నిలిచిపోయిన గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని సభ్యులు పోడియం ఎదుట ఆందోళనకు దిగారు. 'అధికారులు మా మాట వినడం లేదు. కనీస సమాచారం ఇవ్వడం లేదు. ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం' అంటూ బయటకు వెళ్లిపోయారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో చర్చలు జరిపినా సభ్యులు తిరిగి రాక పోవడంతో సమావేశం వాయిదా పడింది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సభ్యుల ఆందోళన, బహిష్కరణ నేపథ్యంలో కొద్దిసేపటికే వాయిదా పడింది. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జెడ్పీ కన్వెన్షన్ హాలులో గురువారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. తొలుత పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారు, ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో జెడ్పీ నిధులు, ప్రభుత్వ నిధులతో మండల స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలను పిలవడంలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా సమావేశాలకు వస్తుంటే ఖర్చులు అధికమైపోతున్నాయని, రెండు సంవత్సరాలుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదంటూ పోడియం ఎదుటకు వచ్చి సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. 'అధికారులు మా మాట వినడం లేదు. కనీస సమాచారం ఇవ్వడం లేదు. ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం' అంటూ సభ్యులు సమావేశపు హాల్ నుంచి వెళ్లిపోయారు. బయట నిలబడి ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు అధికారులు కనీస సమాచారం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మిగతా 4లో..

జోరుగా వర్షం

- అత్యధికంగా మచిలీపట్నంలో 52.6 మి.మీ వర్షపాతం
- అత్యల్పంగా పామర్రులో 3.8 మి.మీ నమోదు
- జిల్లాలో 24.7 మి.మీ సగటు వర్షపాతం నమోదు

మచిలీపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జోరుగా వర్షం కురిసింది. గురువారం తెల్లవారు జామున ఒక మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. మచిలీపట్నంలో అత్యధికంగా 52.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పామర్రులో 3.8 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 24.7 మిల్లీమీటర్లుగా ఉంది. గూడూరు మండలంలో 43.8, అవనిగడ్డలో 41.8, బంటుమిల్లిలో 37.6, పమిడిముక్కలలో 36.0, ఘంటసాలలో 34.0, తోట్లవల్లూరులో 33.6, పెనమలూరులో 31.6, కంకిపాడులో 30.2, చల్లపల్లి మండలంలో 28.6, పెడనలో 28.4, మొవ్వలో 24.2, మోపిదేవిలో 23.6, కృత్తివెన్నులో 21.6, గుడ్లవల్లేరులో 21.2 మి.మీ వర్షం కురిసింది. ఉయ్యూరులో 21.0, పెదపారుపూడిలో 14.6, కోడూరులో 14.4, గుడివాడలో 14.2, బాపులపాడులో 13.2, గన్నవరంలో 12.6, నందివాడలో 12.4, నాగాయలంకలో 12.4, ఉంగుటూరులో 11.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



క్యూలో భక్తులు, ఇన్‌సెట్‌లో హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయ స్వామి

వైభవంగా..

- వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు
- హనుమాన్ జంక్షన్‌లో కన్నులపండువగా రథోత్సవం

హనుమాన్‌జంక్షన్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఘనంగా జరిపారు. తెల్లవారు జామున స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి దర్శనం కోసం క్యూకట్టారు. ఆర్య వైశ్య సంఘం, మానవత సంస్థ, పలు వ్యాపార సంస్థలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు. అనంతరం అభయాంజనేయ స్వామి ఉత్సవ మూర్తికి జంక్షన్‌లోని ప్రధాన వీధుల్లో డప్పు విన్యాసాలు, కేరళ వాయిద్యాలు, విచిత్ర వేషాల నడుమ దేవస్థానం నిర్వాహకులు కన్నుల పండువగా రథోత్సవం నిర్వహించారు.

అభయాంజనేయుడి సేవలో ఎమ్మెల్యేలు

అభయాంజనేయస్వామిని గన్నవరం, ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బడేటి రామకృష్ణయ్య, మిగతా 4లో..

'అగ్రిగోల్డ్'లో జోగి అక్రమాలు నిజమే..



- అంబాపురం భూముల్లో తనిఖీలు
- నిర్ధారించిన అధికారుల బృందం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని మాజీమంత్రి జోగి రమేశ్ జప్తు చేసిన భూముల్లో అక్రమాలు చేశారని తేలిపోయింది. ఒక సర్వే నెంబరుతో సర్వే ధ్రువీకరణ పత్రం తీసుకుని మరో సర్వే నెంబరు భూమిలో రియల్ వ్యాపారం చేసినట్టు నిర్ధారణైంది. విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో ఉన్న అగ్రిగోల్డ్‌కు చెందిన భూమిని జోగి రమేశ్ ప్లాట్లుగా విభజించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన విషయం తెలిసిందే. జోగి కుమారుడు రాజీవ్ పేరుతో ఈ భూములు రిజిస్ట్రేషన్ చేయించారు. దీనిపై ఏసీబీ కేసు నమోదైంది. రాజీవ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపగా, బెయిల్‌పై విడుదలయ్యాడు. అగ్రిగోల్డ్ సంస్థ ఖాతాదారులను మోసం చేయడంతో నమోదైన కేసులో సీఐడీ ఆ సంస్థకు సంబంధించిన చర, స్థిరాస్తులను జప్తు చేసింది. ఇందులో అంబాపురంలోని సర్వే 87లో ఎకరం భూమి జప్తు జాబితాలో ఉంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న జోగి రమేశ్ కన్ను ఆ భూమిపై పడింది. సర్వే నెంబరు 88లో సర్వే ధ్రువీకరణపత్రం తీసుకుని సర్వే నెంబరు 87లో ఉన్న ఎకరం భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించారు. దీనిపై సంయుక్త తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం రెవెన్యూ, ఏసీబీ, సీఐడీ, సర్వే శాఖల అధికారులతో ఒక బృందాన్ని నియమించింది. ఇందులో అధికారులు గురువారం అంబాపురంలో సర్వే చేశారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ ఎకరం భూమిని తొమ్మిది ప్లాట్లుగా విభజించారు. ఈ భూముల్లో ప్రహరీ నిర్మించారు. లే అవుట్‌లో రహదారిని చూపించారు. అధికారులు పరిశీలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ప్లాట్ల యజమానులు అక్కడికి వచ్చారు. వారిని అధికారులు విచారణ చేశారు. తమకు ఈ భూములను జోగి రాజీవ్ విక్రయించినట్టు వివరించారు. భూమిలో ఉన్న హద్దులను రాసుకుని అధికారుల బృందం ఒక నివేదికను రూపొందించింది. దీన్ని త్వరలో ఏసీబీ అధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

ఏపీఈఏపీసెట్‌కు 7,317 మంది హాజరు 6

దాత ఆశయం ఆవిరి

- యథేచ్ఛగా ఆక్రమణలు
- ప్రజా అవసరాలకు 34 సెంట్ల స్థలం పంచాయతీకి అప్పగింత
- ప్రైవేటు వ్యక్తి దావాపై కోర్టులో కేసు గెలిచిన పంచాయతీ
- ఆ తర్వాత స్థలం భద్రత గాలికి వదిలేసిన అధికారులు
- అడుగు పెట్టేందుకు వీల్లేకుండా వెలిసిన ఆక్రమణలు
- చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి వినతి

తోట్లవల్లూరు ప్రజల అవసరాల కోసం జమిందారు గ్రామ పంచాయతీకి ఇచ్చిన 34 సెంట్ల స్థలం ఆక్రమణలకు గురైంది. దానంగా ఇచ్చిన స్థలాన్ని ఓ ప్రైవేటు వ్యక్తి తన సొంతమని కోర్టులో దావా వేయగా పంచాయతీ గెలిచింది. కేసు గెలిచిన తర్వాత తనకెందుకన్నట్టు నిర్లక్ష్యంగా ఉండటంతో స్థానికులు ఆక్రమించి వ్యాపారాలు చేయటం, వాహనాలను పార్కింగ్ చేయటం సాగిస్తున్నారు. దీనిపై గ్రామానికి చెందిన చింతా రాజా స్పందించి స్థలాన్ని రక్షించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి గురువారం వినతి పత్రం అందించారు.



తోట్లవల్లూరు సెంటర్లో ఆక్రమణలకు గురైన స్థలం

తోట్లవల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి):

తోట్లవల్లూరు పూర్వం జమిందారుల ఏలుబడిలో ఉండేది. జమిందారు బొమ్మదేవర నాగన్ననాయుడు వంశీకులు పాలించారు. వేల ఎకరాలు జమిందారు ఆధీనంలో ఉండేవి. జమిందారులు పాలనా సౌలభ్యం కోసం 1900వ సంవత్సంలో తోట్లవల్లూరును నార్తువల్లూరు, సౌత్ వల్లూరు గ్రామాలుగా విభజించారు. వారి కోటల ఎదుట విశాలమైన 34 సెంట్ల స్థలం ఉండేది. అయితే కాలక్రమంలో జమిందారులు కనుమరుగు కావటంతో వారి కుటుంబీకులు కోటలను తొలగించి సుమారు 40 ఎకరాల లేఅవుట్ వేసి గ్రామస్తులకు విక్రయించారు. కోట ఎదుట ఉన్న 34 సెంట్ల స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగాను, లే అవుట్ స్థలాలను కొనుగోలు చేసిన ప్రజల రాకపోకల నిమిత్తం పంచాయతీకి దానంగా ఇచ్చారు. అయితే ఈ 34 సెంట్ల స్థలంపై గ్రామంలోని ఓ వ్యక్తి కోర్టులో కేసు వేసి తన స్థలంగా వాదించాడు. దీంతో గ్రామ పంచాయితీ, లే అవుట్ స్థలాల ప్రజలు ఉమ్మడిగా కోర్టుకు వెళ్లారు. ఈ కేసు ఇరుపక్షాల మధ్య చాలా కాలం నడవగా చివరికి పంచాయతీకి, లే అవుట్ స్థలాల ప్రజలకు అనుకూలంగా 2020 జనవరి 10వ తేదీన 1112/2008 ద్వారా విజయవాడ సీనియర్ సివిల్ కోర్టు తీర్పు ఇచ్చింది. కోర్టు తీర్పు పత్రాలు లే అవుట్ స్థలాల ప్రజల వద్ద ఉన్నాయి. ఈ 34 సెంట్లను పబ్లిక్ స్థలంగా ఉంచాలని, స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని, ఎవ్వరూ ఆక్రమణలకు పాల్పడ కూడదని, స్థలాన్ని పంచాయతీ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశిస్తు కోర్టు తీర్పు ఇచ్చిందని కోర్టులో విజయం సాధించిన చింతా రాజా తెలిపారు.

ఆక్రమణల పర్వం

పంచాయతీ గెలిచిన 34 సెంట్ల స్థలం కోట్లాది రూపాయల విలువ చేస్తుంది. బంగారంతో సమానంగా మారింది. గతంలో ఆర్టీసీ బస్సులు ఈ స్థలంలో నిలిపి ప్రయాణికులను తీసుకెళ్లేవారు. గ్రామస్తులు కబడ్డీ, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఈ స్థలంలో నిర్వహించేవారు. ఆర్టీసీ బస్సులకు తగిన నిలువ నీడ లేకపోవటంతో పక్కనే ఉన్న పొట్లూరి రమేష్ తన 12 సెంట్ల స్థలాన్ని ఉయ్యూరు ఆర్టీసీ డిపోకు రిజిస్టర్ చేశారు. అయితే ప్రజోపయోగాల కోసం పంచాయతీకి ఇచ్చిన స్థలం చుట్టూ ఆక్రమణలు వెలుస్తున్నాయి. కూరగాయల దుకాణం, ప్రైవేటు వాహనాల పార్కింగ్ అడ్డదిడ్డంగా చేస్తుండటంతో కనీసం ఆర్టీసీ బస్సు స్వేచ్ఛగా ఈ స్థలంలోకి రాలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నపుడు మద్యనిషేధం విధించారు. ఆ సమయంలో మద్యంతో పట్టుబడిన రాష్ట్రేతర లారీని పోలీసులు పట్టుకుని సీజ్ చేసి ఈ స్థలంలో పెట్టారు. ఈ లారీ పాడుపడిపోయి చాలా స్థలాన్ని ఆక్రమించింది. దీంతో 34 సెంట్ల స్థలం ప్రజలకు ఉపయోగం లేకుండా మారింది.

కార్యదర్శికి వినతి పత్రం అందజేత

జమిందారు లే అవుట్ స్థల యజమాని చింతా రాజా గురువారం తోట్లవల్లూరు పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌ను కలిసి 34 సెంట్ల పబ్లిక్ స్థలాన్ని కోర్టుతీర్పుకు అనుగుణంగా రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. ఈ స్థలం నుంచే పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు ఉందని, దానిని కూడా సీసీరోడ్డుగా అభివృద్ధి చేసేందుకు పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేయాలని కోరారు. వినతి పత్రంతో పాటు కోర్టు తీర్పు నకళ్లను కార్యదర్శికి అందించినట్టు రాజా తెలిపారు.



కార్యదర్శికి వినతి పత్రం అందిస్తున్న చింతా రాజా



కృష్ణా వర్సిటీ అభివృద్ధికి కృషి 6

- వర్సిటీ అచీవర్స్ డేలో ఎంపీ బాలశౌరి
- విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు

జిల్లా మినీ మహానాడును విజయవంతం చేయండి

- ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ

6

ప్రతి పౌర్ణమికి స్వర్ణకవచ, వజ్ర కిరీటధారిగా దుర్గమ్మ దర్శనం

కొత్త బస్సులకు గ్రీన్ సిగ్నల్

- రెండు నెలల తర్వాత రిజిస్ట్రేషన్ చేసిన రవాణా శాఖ
- ఫైర్ ప్రొటెక్టివ్ సిస్టమ్ లేకపోవడం వల్ల మొదట్లో అభ్యంతరం
- ఫైర్ డిటెక్టివ్ అలారం ఏర్పాటుకు ఆర్టీసీ అంగీకారం
- ఇప్పటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి
- త్వరలో రీజియన్ పరిధిలోని డిపోలకు కేటాయింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొత్తగా కొన్న ఆర్టీసీ బస్సులకు మార్గం సుగమమైంది. ఈ బస్సులొచ్చి చాలాకాలం కావస్తున్నా రిజిస్ట్రేషన్ చేయడానికి రవాణా శాఖ అభ్యంతరం వ్యక్తం చేయటంతో రోడ్లపై తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఫైర్ ప్రొటెక్టివ్ సిస్టమ్ (ఎఫ్‌పీఎస్) ఏర్పాటు చేస్తేనే బస్సులకు రిజిస్ట్రేషన్ చేస్తామని రవాణా శాఖాధికారులు చెప్పటంతో కొత్త బస్సులకు రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. దాదాపు రెండు నెలలకు పైగా బస్సులకు రిజిస్ట్రేషన్ జరక్కపోవడంతో ఆర్టీసీకి నష్టం జరిగింది. ఎట్టకేలకు కొత్త బస్సులు రోడ్లపైకి వచ్చే దారి ఏర్పడింది. ఫైర్ డిటెక్టివ్ అలారం (ఎఫ్‌డీఏ)కు ఏర్పాటుకు ఆర్టీసీ అంగీకరించింది. తొలుత ఎఫ్‌డీఏ విధానానికి రవాణా శాఖ అధికారులు అంగీకరించలేదు. కానీ, ఎఫ్‌పీఎస్ ఏర్పాటు చేయాలంటే బస్సు బాడీ బిల్డింగ్ పూర్తి చేసుకున్నాక కుదరదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు బాడీ బిల్డింగ్ పూర్తయిన బస్సుకే మినహాయింపు ఇస్తూ రవాణా శాఖ అధికారులు రిజిస్ట్రేషన్ చేయటానికి అంగీకరించారు. దీంతో ఆర్టీసీ అధికారులు కొత్త బస్సుల్లో ఫైర్ డిటెక్టివ్ అలారంను ఏర్పాటు చేశారు. బస్సులన్నింటికీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. వాటిని రీజియన్ పరిధిలోని జగ్గయ్యపేట, తిరువూరు, ఆటోనగర్, విజయవాడ బస్ డిపోలకు తరలించారు.

మొత్తం 75 సూపర్ లగ్జరీ బస్సులు

ఎన్టీఆర్ జిల్లాకు తొలిదశలో 75 సూపర్ లగ్జరీ బస్సులు వచ్చాయి. ఈ బస్సులన్నీ హైఎండ్ శ్రేణిలోనివే. వీటికి దాదాపు రెండు నెలల పాటు రిజిస్ట్రేషన్ జరక్కపోవటం వల్ల నష్టం వాటిల్లింది. ఇటీవల రోడ్డు సేఫ్టీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ప్రయాణికులను తరలించే రవాణా వాహనాలకు కచ్చితంగా ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్ (ఎఫ్‌పీఎస్)ను ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. అయితే, మిగతా 4లో..

తొలగిస్తారా.. వేలం వేయమంటారా! 6

- బస్‌స్టేషన్ నిర్మాణానికి అడ్డుగా శిథిల లారీ
- తోట్లవల్లూరు ఎస్ఐకి ఆర్టీసీ అధికారుల వినతి

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీపందిరి మహదేవుడు కోటిలింగాల సత్రం

కోటిలింగాలపేట, రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా, ఫోన్ నెం: 0883-2476959, సెల్: 9989085057, 9491000718

స్మార్త పాఠశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

పవిత్ర గోదావరి తీరాన రాజమహేంద్రవరం, కోటిలింగాల పేటలో గల శ్రీపందిరి మహదేవుడు కోటిలింగాల సత్రం నందు స్మార్త పాఠశాలలో 6 సంవత్సరముల కృష్ణ యజుర్వేద స్మార్త విద్య కోర్సును అభ్యసించుటకు 2025-26 సంవత్సరమునకు బ్రాహ్మణ బాలుర నుండి నూతనంగా ధరఖాస్తులు కోరబడుచున్నవి.

అర్హతలు: బాలురు వయస్సు 9 సంవత్సరములు నుండి 14 సంవత్సరములలోపు ఉండి, ఉపనయనం జరిగి వుండవలెను.

సౌకర్యములు: విద్యార్థులకు నెలకు 1కి, రూ.2000/- స్టైఫండ్ ఇవ్వబడును. ఆహ్లాదకర, ఆధ్యాత్మిక వాతావరణంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన ఇవ్వబడును మరియు వసతి, భోజనం, వస్త్ర, ప్రథమ చికిత్స వైద్య సౌకర్యములు సత్రం వారు ఉచితంగా కల్పించెదరు.

ప్రవేశము కొరకు ఇంటర్వ్యూ తేదీ: ది.11.06.2025 బుధవారం ఉదయం 10.30 నుండి సాయంత్రం 4.00 గంట వరకూ జరిగే మౌలిక ఇంటర్వ్యూకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులతో హాజరుకాగలరు.

1) విద్యార్థి జనన ధృవీకరణ పత్రం (జిరాక్సు కాపీలు -3) (ఒరిజినల్ చూపవలెను). 2) ధరఖాస్తు . 3) విద్యార్థి మరియు తల్లిదండ్రుల/ సంరక్షకుల ఆధార్ కార్డు (జిరాక్సు -3) (ఒరిజినల్ చూపవలెను). 4) రేషన్ కార్డు జిరాక్సు కాపీలు -3 (ఒరిజినల్ చూపవలెను). 5) ఉపనయనం శుభలేఖ. 6) ఉపనయనం జరిగిన ఫోటోలు-2. 7) విద్యార్థి యొక్క 4 పాస్ పోర్టు ఫోటోలు.

మౌలిక ఇంటర్వ్యూ నందు ఉత్తీర్ణులు అయిన వారిని ఎంపిక చేయబడును. దరఖాస్తు కొరకు కార్యాలయ పనివేళలలో అనగా ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకూ ది.23.05.2025 నుండి ది.09.06.2025 వరకూ పొందవచ్చును. ఇంటర్వ్యూలు పూర్తైన పిదప సెలక్టు కాబడిన అభ్యర్థులకు 2 రోజులలో తరగతులు ప్రారంభించబడును.

ఇట్లు: **పి.విశ్వనాథరాజు,** సహాయకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి



ప్రధాన ఆలయంలో, ఘాట్ రోడ్డులో, పాత మెట్ల మార్గంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఈవో శీనా నాయక్



శ్రీ ఆంజనేయం..

» ఇంద్రకీలాద్రిపై హనుమజ్జయంతి ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి, మే 22 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో క్షేత్రపాలక శ్రీఆంజనేయస్వామి, ఘాట్‌రోడ్డులో, పాతమెట్లు మార్గంలోని ఆలయాలలో అభిషేకాలు, నాగవల్లీ దళార్చన, రుద్రసహిత మన్యుసూక్త హోమ కార్యక్రమాలు, పూర్ణాహుతి మంత్రపూర్వకంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉప ప్రధాన అర్చకుడు శంకర శాండిల్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌర్ణమికి స్వర్ణకవచ, వజ్ర కిరీటధారిణిగా

దర్శనమివ్వనున్న కనకదుర్గమ్మ



ఇంద్రకీలాద్రి, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల సన్నిధిలో వైదిక కార్యక్రమాలు మరింత వైభవంగా జరిగేందుకు, నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు, ఆషాఢ, శ్రావణ మాసాలలో ఏర్పాట్లపై ఆలయ ఈవో వీకే శీనా నాయక్ గురువారం దేవస్థానం వైదిక కమిటీ, ప్రధాన అర్చకులు, వేద పండితులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవదాయశాఖ కార్యదర్శి, కమిషనర్ నిర్వహించిన సమావేశంలో నిర్దేశం చేసిన అంశాలను వైదిక కమిటీ సభ్యులకు వివరించారు. ప్రతి పౌర్ణమి రోజున కనకదుర్గమ్మ స్వర్ణకవచంతో భక్తులకు దర్శనమిస్తుండగా, ఇకపై స్వర్ణ కవచం, వజ్ర కిరీటంతో దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రతిభక్తునికి అమ్మవారి కుంకుమ అందేలా చూడటం, ఆర్జిత సేవలు సమయానికి ప్రారంభించడం, నివేదనలు ఆగమ శాస్త్రం ప్రకారం జరపటం, కొత్త సేవలు ప్రారంభించడానికి శాస్త్ర ప్రమాణాలు తెలియజేయాలని ఈవో కోరారు. దేవతామూర్తుల అలంకరణ, వస్త్రాలు వైభవంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వరశాస్త్రి, సుందరబాబు, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, కోట రవికుమార్, ఆర్.శ్రీనివాస శాస్త్రి, ఏఈవోలు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 7317 మంది హాజరు

బెంజిసర్కిల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలకు గురువారం ఎన్టీఆర్ జిల్లా నుంచి 7317 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 7790 మంది దరఖాస్తు చేసుకోగా 7317 మంది పరీక్షకు హాజరయ్యారు. 93.93శాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. అదేవిధంగా కృష్ణాజిల్లా నుంచి 1011మంది దరఖాస్తు చేసుకోగా 974 మంది పరీక్షలకు హాజరయ్యారు. 96.34 శాతం నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నం సత్య కన్వెన్షన్ హాలులో శుక్రవారం జరగనున్న మినీ మహానాడును విజయవంతం చేయాలని కృష్ణాజిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ కోరారు. గురువారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే మహానాడు కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, వర్లకుమార్ రాజా, కాగిత కృష్ణప్రసాద్, బోడే ప్రసాద్ పాల్గొంటారన్నారు. వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన తీర్మానాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాస్థాయిలో చేసిన తీర్మానాలను కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడు కార్యక్రమంలో ప్రవేశపెడతారన్నారు. సమావేశంలో పార్టీ పదవులపై చర్చలు, అభిప్రాయ సేకరణ జరుగుతాయన్నారు. ప్రజాస్వామ్యయుతంగా పార్టీశ్రేణులు తమ అభిప్రాయాన్ని చెప్పుకునేందుకు ఇదొక చక్కటి అవకాశమన్నారు.



విద్యార్థి తండ్రిని సత్కరిస్తూ ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

కృష్ణా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి

» యూనివర్సిటీ అచీవర్స్ డేలో ఎంపీ బాలశౌరి

» విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

మచిలీపట్నం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయం(కేయూ) అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.40 కోట్లు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. కేయూలో గురువారం నిర్వహించిన అచీవర్స్ డేలో 238 మంది ఆర్ట్స్, సైన్సు విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను ఎంపీ బాలశౌరి, ఎస్పీ ఆర్.గంగాధరరావు అందజేశారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో అథ్లెటిక్ ట్రాక్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, టెన్నిస్ కోర్టు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి రూ.40 కోట్లు ప్రతిపాదనలు పంపారని, వాటిని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని, బెల్ ద్వారా సీఎస్ఆర్ నిధులు తీసుకొస్తామని బాలశౌరి తెలిపారు. చిన్న కుటుంబంలో జన్మించిన తాను విద్యను నమ్ముకుని ఉన్నత స్థాయికి ఎదిగానని ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఉపకులపతి ఆచార్య కె.రాంజీ డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, రిజిస్ట్రార్ ఎన్.ఉష, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ వైకే సుందరకృష్ణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సమన్వయకర్త డాక్టర్ కిషోర్ ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావమే సంచలనం

» నేడు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తోంది

» ఎన్టీఆర్ స్ఫూర్తిని చంద్రబాబు కొనసాగిస్తున్నారు

» జిల్లా మినీ మహానాడులో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం



ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలంటూ కార్యకర్త తెచ్చిన బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న నెట్టెం రఘురాం, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం తాతయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

ఇబ్రహీంపట్నం, మే 22(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ ఆవిర్భావమే ఒక గొప్ప సంచలనం. నేడు దేశ రాజకీయాలను ప్రభావితం చేయగలుగుతుందంటే అది స్వర్గీయ ఎన్టీఆర్ కృషి ఫలితమే. అరవై ఏళ్ల వయస్సులో పార్టీ స్థాపించి ప్రజలకు ఎనలేని సేవలందించిన ఎన్టీఆర్ స్ఫూర్తిని సీఎం నారా చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్నారు.' అని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం



తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

అన్నారు. గుంటుపల్లి సీఏ కన్వెన్షన్‌లో గురువారం పండుగలా నిర్వహించిన జిల్లా మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. తొలుత నేతలు పార్టీ జెండాను ఆవిష్కరించాక, జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ ప్రతిమకు నివాళులర్పించారు. సభకు నెట్టెం అధ్యక్షత వహించారు. జగన్‌లాంటి నియంతను తాను ఇప్పటివరకు చూడలేదని నెట్టెం అన్నారు. ఐదేళ్ల అరాచకపాలనలో టీడీపీ నేతలను, కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెట్టాడని, వాటన్నింటినీ తట్టుకుని, నిలబడి అధికారం సాధించుకున్న తర్వాత జరుగుతున్న తొలి మహానాడు ఇది అని ఆయన అన్నారు. జిల్లాలో భారీగా టీడీపీ సభ్యత్వాలను చేసినందుకు నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పని చేయాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ సంక్షేమానికి బాటలు వేస్తే, సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని, దేశంలోనే కృష్ణా - గోదావరి నదులను అనుసంధానం చేసిన మార్గదర్శకుడు చంద్రబాబు అని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, కడపలో జరిగే మహానాడును జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేద్దామని మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన పార్టీ టీడీపీ అని, అందులో సభ్యునిగా ఉండటం గర్వంగా ఉందని, దార్శనికుడు సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని, పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం తాతయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి రఫీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు జంపాల సీతారామయ్య, బొమ్మసాని సుబ్బారావు, కె.విజయబాబు, ధారునాయక్, ఆనంద్ సూర్య పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన పార్టీశ్రేణులు

ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి జిల్లా మినీ మహానాడుకు పెద్ద సంఖ్యలో టీడీపీ కుటుంబ సభ్యులు తరలివచ్చారు. అధికారంలోకి వచ్చాక, ఎన్టీఆర్ జిల్లాగా ఏర్పడిన తర్వాత జరిగిన తొలి మహానాడు కావడంతో నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పార్టీ విధి విధానాలను, తీర్మానాలను ఆసక్తిగా విన్నారు. అనంతరం వచ్చిన వారికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు.

సూట్‌కేసు కంపెనీలు పెట్టే అలవాటు నాకు లేదు

» దమ్ముంటే లిక్కర్ స్కాం ఎవరి హయాంలో జరిగిందో చెప్పు

» మాజీ సీఎం జగన్‌కు ఎంపీ కేశినేని చిన్ని సవాల్

'నీలాగా సూట్‌కేసు కంపెనీలు పెట్టే అలవాటు నాకు లేదు. దమ్మూ ధైర్యం ఉంటే లిక్కర్ స్కాం ఎవరి హయాంలో జరిగిందో చెప్పాలి.' అని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సవాల్ విసిరారు. జగన్ రెడ్డీ నువ్వు కేవలం ఎమ్మెల్యేవి.. నేను ఎంపీని.. నాస్థాయి ఎక్కువ అని గ్రహించు.. నీలి మీడియాలో రాసే కంపెనీలు ఎక్కడున్నాయో చెప్పు. అని 'మినీ మహానాడు' వేదికగా చిన్ని నిలదీశారు. వైసీపీ గూండాలు, ఆకురౌడీలు దౌర్జన్యాలు దాడులు చేయాలని ప్రయత్నిస్తే తెలుగు తమ్ముళ్లు తిప్పికొట్టాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకే తాను సమాధానం చెబుతాననని, విదూషకులకు చెప్పబోనని స్పష్టం చేశారు.

ఎంపీ కేశినేని చిన్నిపై జగన్ ఆరోపణలు నిరాధారం

» మాజీ ఎంపీ కేశినేని నానీ పేటీఎం బ్యాచ్‌లో చేరారు

» స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి

'ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)పై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) పేటీఎం బ్యాచ్‌లో చేరారు. చిల్లరకు కక్కుర్తి పడి నాని చేసిన ఆరోపణలే జగన్ కూడా చేస్తున్నారు. బెంజిసర్కిల్‌లో కట్టిన హోటల్ ఎవరి పేరుపైన పెట్టావు? బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టి దగా చేశావు కాబట్టే గుమాస్తాలను డైరెక్టర్లుగా పెట్టుకున్నావు. బ్యాంకులను మోసం చేసిన నీతో మాట్లాడించేది తాడేపల్లి సైకో కాదా?' అని కేశినేని నానీని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి నిలదీశారు.

కొత్త బస్సులకు గ్రీన్‌సిగ్నల్

(3వ పేజీ తరువాయి)

ఈ నిబంధనలు రాక ముందే ఆర్టీసీ కొత్త బస్సులకు ఆర్డర్ ఇచ్చేసింది. ఆ బస్సులు డెలివరీ కావటానికి జాప్యం జరిగింది. చాసిస్‌లకు బాడీ బిల్డింగ్‌కు ఇచ్చిన తర్వాత ఆదేశాలు వచ్చాయి. ఈ ఆదేశాల గురించి ఆర్టీసీ అధికారులకు అవగాహన లేకపోవటం వల్ల బాడీ బిల్డింగ్ పూర్తి చేసుకున్న బస్సులను రిజిస్ట్రేషన్ చేయించటానికి పంపగా, రవాణా శాఖ అధికారులు తిరస్కరించారు. ఎఫ్‌పీఎస్‌ను ఏర్పాటు చేస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు.

ఎఫ్‌పీఎస్ అంటే..

ఎఫ్‌పీఎస్ అనేది ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటు చేసే వ్యవస్థ. ఇటీవల కాలంలో బస్సుల నుంచి పొగ వచ్చి కాలిపోతున్న ఉదంతాలను చూస్తున్నాం. ఇలాంటి సందర్భాల్లో ఈ వ్యవస్థ ద్వారా బస్సులో అగ్ని ప్రమాదాలను ముందే గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేయటంతో పాటు బస్సును కూడా కాపాడవచ్చు. డ్రైవర్ క్యాబిన్, ప్రయాణికుల కంపార్ట్‌మెంట్లలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ ఉపయోగిస్తారు. ఇవి అగ్ని ఎంత తీవ్రస్థాయిలో ఉన్నా మంటలను ఆర్పుతాయి. ఒకవేళ ఇంజన్ నుంచి మంటలు వచ్చినా ఫోమ్‌ను భారీగా వెదజల్లి ఆ బస్సు అగ్నికి ఆహుతి కాకుండా చేస్తాయి. ఒక ఎఫ్‌పీఎస్ ఏర్పాటుకు రూ.2 లక్షలు ఖర్చవుతుంది. అన్ని బస్సులకు ఈ బడ్జెట్ కేటాయించటం ఇప్పుడు ఆర్టీసీకి ఇబ్బందే. ఈ వ్యవస్థను బస్సు బాడీ బిల్డింగ్ సమయంలోనే ఏర్పాటు చేయాలి. కొత్త బస్సుల్లో ఏర్పాటు చేయాలంటే బాడీ బిల్డింగ్ మొత్తం తొలగించాలి. దీనికి ప్రతిగా ఫైర్ డిటెక్టివ్ అలారం (ఎఫ్‌డీఏ) ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారు. దీనిని డ్రైవర్ వద్ద ఏర్పాటు చేస్తారు. బస్సులో ఏ భాగం నుంచి పొగలు వచ్చినా అలారం మోగుతుంది. వెంటనే డ్రైవర్ ప్రయాణికులను అప్రమత్తం చేస్తాడు.

బహిష్కరణ

(3వ పేజీ తరువాయి)

గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని కోరుతూ నినాదాలు చేశారు.

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో చర్చలు జరిపినా వెనక్కి తగ్గని సభ్యులు

జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లి సమావేశపు హాల్ ఎదుట ఆందోళనకు దిగడంతో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనంద్‌కుమార్ వారి వద్దకు వెళ్లి చర్చలు జరిపారు. సభ్యులకు కనీస సమాచారం ఇచ్చే అంశంపై రెండు జిల్లాల కలెక్టర్‌లు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారని తెలిపారు. సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేసే అంశంపై ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాశామని, ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సభ్యులకు వివరించి సమావేశానికి హాజరుకావాలని కోరారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ప్రతిపాదనలను తోసిపుచ్చిన సభ్యులు సమావేశానికి హాజరుకాకుండా ఎడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌కు వెళ్లి అక్కడే ఉండిపోయారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడండి : చైర్‌పర్సన్

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధికారులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంపై జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ఏటా జెడ్పీ నుంచి రూ.40 కోట్లు తాగునీటి పథకాలకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మరో రూ.20 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని మండిపడ్డారు. తమ గ్రామమైన కొత్తూరులోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను తదితర మండలాల్లో తాగునీటి పథకాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీ నిధులతో చేపట్టిన పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు అధికారులు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులకు కనీస సమాచారం ఇవ్వని అధికారులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. జెడ్పీ జనరల్ ఫండ్స్ నుంచి సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేయాలని జెడ్పీ సీఈవోకు సూచిస్తే ఆడిట్ అభ్యంతరాలు వస్తాయని చెబుతూ, సాచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. రెండు జిల్లాల కలెక్టర్‌లు ఈ అంశాలపై దృష్టి సారించాలని కోరారు.

శ్రీకాకుళంలో మట్టి తవ్వకాలను ఆపండి

ఘంటసాల మండలం శ్రీకాకుళంలో 200లకు పైగా టిప్పర్లతో చెరువు మట్టిని రోజూ అక్రమంగా తరలించేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఘంటసాల జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ విషయం సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు తెలియజేయాలని చూస్తే గనులశాఖ అధికారులు ఈ సమావేశానికి రాలేదన్నారు. మట్టి తవ్వకాలపై కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు.

సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం : కలెక్టర్‌లు

కృష్ణా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశలు మాట్లాడుతూ, జిల్లా పరిషత్ సభ్యులకు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి అధికారులు కనీస సమాచారం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. సభ్యులకు గౌరవ వేతనం విడుదలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్ రాజ్, ఉమ్మడి జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వణుకూరులో మొబైల్ టైలరింగ్ సేవలందిస్తున్న షేక్ కాలేషా

దర్జాగా..దర్జీ!

● ఇంటివద్దకే టైలరింగ్ సేవలు..

● వణుకూరులో సీనియర్ టైలర్ షేక్ కాలేషా వినూత్న ఆలోచన

రెడీమేడ్, డిజైన్ దుస్తుల కారణంగా టైలర్లకు చేతినిండా పని లేకుండా పోయిన ఈ రోజుల్లో వినూత్నంగా ఆలోచించాడు మండలంలోని వణుకూరుకు చెందిన సీనియర్ టైలర్ షేక్ కాలేషా. పని లేదని నిరుత్సాహపడ కుండా టైలరింగ్ సేవలను వినియోగదారుల ఇంటి వద్దకు తీసుకెళ్లి దర్జాగా దర్జీ సేవలందిస్తున్నాడు. అందుకోసం తొలుత ఓ రిక్షాను కొన్నాడు. ఎక్కడికయినా తీసుకెళ్లేందుకు అనుగుణంగా దానికి మార్పులు చేసి కుట్టు మిషన్‌ను అనుసంధానించాడు. గ్రామంలోని కాలనీల్లో తిరుగుతూ ఇళ్ల వద్దే పాత, చిరిగిన దుస్తులు కుట్టడం ప్రారంభించాడు. తన సేవలకు మంచి ఆదరణ లభించడంతో టీవీఎస్ ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేసి పొరుగూళ్లకు తన సేవలు విస్తరించాడు. రోజుకో గ్రామం తిరుగుతూ ఉపాధి పొందుతున్నాడు. అవసరం ఉన్నవాళ్లు కాలేషాకు ఫోన్లు చేసి మరీ దుస్తులు కుట్టించుకుంటున్నారు. - (ఆంధ్రజ్యోతి-పెనమలూరు)



చోడవరంలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే బోడె

పెనమలూరు, మే22(ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరానికి అనుసంధానంగా ఉన్న చోడవరం వంటి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. చోడవరంలో ఆర్ అండ్ బీ, ఎన్నార్జీస్ నిధులు రూ. కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకొన్న సీసీ రోడ్లను ప్రారంభించి ఆయన మాట్లాడారు. గ్రామంలో రోడ్ల నిర్మాణం వల్ల రవాణా, రాకపోకలు పెరిగి గ్రామం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గ్రామ సర్పంచి కాకాని వెంకటరత్నం, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కలపాల శ్రీధర్, సీనియర్ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు కోయ ఆనంద్ ప్రసాద్, దొండపాటి సురేష్, ఎంపీడీఓ ప్రణవి, రంగారావు పాల్గొన్నారు.

కాసరనేనివారిపాలెంలో

కంకిపాడు : అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కాసరనేనివారిపాలెంలో రూ. 45 లక్షలు ఉపాధి హామీ నిధులతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులు రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



తమ స్థలంలో లారీని తొలగించాలని ఎస్ఐకి వినతి పత్రం ఇస్తున్న ఆర్టీసీ అధికారులు

తొలగిస్తారా.. వేలం వేయమంటారా!

» బస్‌స్టేషన్ నిర్మాణానికి అడ్డుగా శిథిల లారీ

» తోట్లవల్లూరు ఎస్ఐకి ఆర్టీసీ అధికారుల వినతి

తోట్లవల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : అనధికార మద్యం తరలిస్తు పట్టుబడిన లారీని సీజ్ చేసి ముప్పై ఏళ్లుగా ఆర్టీసీ స్థలంలో ఉంచారని, తక్షణం శిథిల లారీనిని తొలగించాలని ఆర్టీసీ అధికారులు తోట్లవల్లూరు ఎస్ఐ అవినాష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. లేకుంటే తామే దానిని తొలగించి వేలం వేస్తామని చెప్పారు. వివరాల్లోకి వెళితే.. ప్రజావసరాల కోసం బస్‌స్టేషన్ నిర్మాణానికి సుమారు 25 సంవత్సరాల క్రితం పొట్లూరి రమేష్ తనకు చెందిన 12 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చారు. అయితే ఉయ్యూరు ఆర్టీసీ డిపోకు ఉచితంగా ఇచ్చిన స్థలాన్ని ఇంతకాలం అధికారులు నిరుపయోగంగా ఉంచారని, స్థలాన్ని తిరిగి తమకు స్వాధీనపర్చాలని దాత రమేష్ సీఎం చంద్రబాబుకు ఇటీవల లేఖ రాశారు. సీఎం సూచన మేరకు స్థలం స్వాధీనం చేసుకునేందుకు ఆర్టీసీ అధికారులు తరలివచ్చారు. విజయవాడ ఆర్టీసీ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం, కృష్ణాజిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎ.వాణిశ్రీ, ఉయ్యూరు ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ పి.పెద్దిరాజు, డిప్యూటీ ఈఈ జగదీష్, ఈఈ కె.రాజశేఖర్‌లు గురువారం సదరు స్థలాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మాకినేని దశరథరామయ్య అధికారులను కలిసి తన సూచనతోనే పొట్లూరి రమేష్ ఆర్టీసీకి స్థలాన్ని ఇచ్చారని, దాత పొట్లూరి రమేష్‌కు ఫోన్‌చేసి ఆర్టీసీ అధికారులతో మాట్లాడించారు. బహుళ అవసరాలకు ఉపయోగపడే విధంగా బస్‌స్టేషన్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో స్థలం వద్ద ఉన్న పాడుబడిన లారీని చూసిన అధికారులు స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ సీహెచ్ అవినాష్‌ను కలిశారు. బస్‌స్టేషన్ నిర్మాణానికి లారీ అడ్డుగా ఉందని, వెంటనే శిథిలమైన లారీని తొలగించాలని, లేకుంటే తామే వేలం వేసి వచ్చిన సొమ్మును ట్రెజరీలో జమచేస్తామని ఎస్ఐకి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి లారీ తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

సరస్వతీ నది పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గన్నవరం, మే 22 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం నుంచి సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శివాజీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ బస్సు 24వ తేదీ శనివారం సాయంత్రం గన్నవరంలో బయలుదేరి తిరిగి 27వ తేదీ ఉదయం వస్తుందన్నారు. ఇతర వివరాలకు 73829-05633, 87909-96090 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

వైభవంగా..

(3వ పేజీ తరువాయి)



అభయాంజనేయ స్వామిని దర్శించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

చింతమనేని ప్రభాకర్ దర్శించుకున్నారు. స్వామి వారికి తమలపాకు పూజ నిర్వహించారు. ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు.పూజ అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేమూరి శ్రీనివాసరావు దేవస్థానం తరపున శేషవస్త్రంతో సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. కాగా, స్థానిక నూజివీడు రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సుందరకాండ పారాయణ యజ్ఞం ముగింపు సందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేకాలు, హోమం, సీతారాముల కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణ పాల్గొన్నారు. స్థానిక నూజవీడు రోడ్డులోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడె వెంకయ్య కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు. దేవస్థానం ఈవో తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇదేం పద్ధతి!

(3వ పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్న సమస్యలపైనా సమావేశంలో చర్చించాల్సి ఉంటే వీటిపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా వైసీపీ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్‌లతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు మధ్యాహ్నం రెండు గంటల వరకు ఖాళీగానే సమావేశపుహాలులో కూర్చుండి పోయారు. సమావేశం అర్ధగంట పాటు కూడా జరగకపోవడంతో అధికారుల సమయం వృథా అయ్యింది. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఈ సమావేశానికి హాజరువుతారని అధికారులు చెప్పారు. కృష్ణా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమం అనంతరం ఆయన ఈ సమావేశానికి బయలుదేరారు. సభ్యులు సమావేశాన్ని బహిష్కరిం చారనే సమాచారంతో ఆయన ఆగిపోయారు.

పాడిరైతు సంక్షేమానికి కృషి



హనుమాన్‌జంక్షన్ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతు సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను (విజయ) పాల ఫ్యాక్టరీలో చైర్మన్ చలసాని ఆంజనేయులుకు గురువారం మొక్క ఇచ్చి ఎండీ ఈశ్వరబాబు అభినందనలు తెలిపారు. చైర్మన్ చలసాని ఆంజనేయులు చేస్తున్న అవిరళ కృషిని కొనియాడారు. ఆపరేషన్స్ జీఎం లక్ష్మారావు, కామధేను(విజయ) ఫాక్టరీ జీఎం సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ

ఉయ్యూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనం చేసి ఆహార పదార్థాలు రూచి చూశారు. భోజనం చేస్తున్నవారిని ఆహారం, శుభ్రత, రుచి, నాణ్యతపై ఆరా తీశారు. వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు అప్పలనాయుడు తదితరులు ఎమ్మెల్యేతో ఉన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

అనుమతుల్లేని లేఅవుట్‌ల తొలగింపు

పెనమలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని యనమలకుదురు కరకట్ట వెంట ఎటువంటి అనుమతులు లేని లే అవుట్‌ను మునిసిపల్ అధికారులు గురువారం తొలిగించారు. అనుమతుల్లేని లే అవుట్‌లను ఉపేక్షించేది లేదని, లేఅవుట్‌లు వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనరు భవానీ ప్రసాద్ హెచ్చరించారు.

రైతుకు అందుబాటులో మార్కెటింగ్ సేవలు

- దొంక రోడ్లు అభివృద్ధికి పక్కా ప్రణాళిక
- యార్డు అభివృద్ధి ఆదాయ వనరులపై దృష్టి....
- ఎంఏసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న అన్నే ధనయ్య



అన్నే ధనయ్య

కంకిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అందుబాటులో ఉంటూ మార్కెటింగ్ సేవలను మరింత చేరువ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పెనమలూరు మార్కెట్ యార్డ్ (కంకిపాడు) కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న అన్నే ధనయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కెటింగ్ యార్డ్‌లో రైతులకు అవసరమైన ధాన్యం, మినుము, పసుపు కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయడం, రైతులకు అవసరమైన గోడౌన్ల ఏర్పాటు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించటంపై దృష్టి పెడతామన్నారు. గత ఏడాది రూ. 2.48 కోట్లు మేరకు ఆదాయం వచ్చిందన్నారు. ఆదాయాన్ని మరింత పెంచేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు తెలియజేశారు. పక్క డొంక రోడ్లు అభివృద్ధికి పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సహకారంతో పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన బకాయిలు రూ. 6 కోట్లు వసూలు చేసి మార్కెట్ యార్డ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తన మీద ఎంతో నమ్మకంతో ఎంఏసీ చైర్మన్ పదవి అప్పగించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు, ఎంపీ వల్లభనేని బాలశౌరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం నిర్వహించనున్న ఎఎంసీ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి తెలుగుతమ్ముళ్లు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.





దావాజీగూడెం ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ నాయకులు



కానుమోలు శివారులో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ



ఉయ్యూరులో హనుమాన్ శోభాయాత్ర

వైభవంగా హనుమజ్జయంతి

గన్నవరం, మే 22 (ఆంధ్రజ్యోతి) : అంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దావాజీగూడెం, బుద్ధవరం, గొల్లనపల్లి గ్రామాల్లో ఆంజనేయస్వామిని దర్శించుకుని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు చేశారు. గొంది నరేంద్ర, ముద్రబోయిన శ్రీనివాసరావు, కంభంపాటి లక్ష్మీ, పాల్గొన్నారు. చిక్కవరం సూర్య ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీ పర్యవేక్షణలో స్వామివారి పల్లకి ఉత్సవం జరిగింది. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** కానుమోలు శివారులోని నాగేంద్ర సహిత హనుమాన్ దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతి సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. పొట్లూరి ప్రసాద్, రాము, పవన్, మూల్పూరి వెంకటరత్నం, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, మొవ్వా వేణుగోపాల్, చింతల వెంకటశివఅప్పారావు, చిన్నాల చిన్నా, దుట్టా శివన్నారాయణ, మొవ్వా వెంకటేశ్వరరావు, దుర్గారావు, అక్కినేని కృష్ణాజీ పాల్గొన్నారు. కాకులపాడులోని కోదండ రామాలయంలో హనుమాన్‌చాలీసా పారాయణ చేశారు. వీరవల్లి దాసాంజనేయస్వామి దేవస్థానంలో తమపాకు పూజ నిర్వహించారు. కొత్తపల్లి భక్తాంజనేయస్వామి దేవస్థానం, బొమ్ములూరు దాసాంజనేయస్వామి దేవస్థానం, రంగయ్యప్పారావుపేటలోని కోదండరామ స్వామి దేవాలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలేరు అడ్డరోడ్డు వద్ద కనుమూరి చినరాజు దివ్యఆశీస్సులతో లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాఅన్నప్రసాద వితరణలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. వీరవల్లి దాసాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కృష్ణవరపు గోపయ్య, కోడెబోయిన బాబి, రాయి రాఘవేంద్రరావు, జగదీష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. **ఉయ్యూరు :** కాటూరు రోడ్డు హనుమాన్ నగర్‌లో అంజనేయ స్వామి ఆలయంలో ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్ పూర్ణచంద్రరావు, వార్డు కౌన్సిలర్ పూర్ణిమ, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి పాల్గొని పూజలు చేశారు. భారీ అన్నసమారాధన చేశారు. అలయ కమిటీ సభ్యులు మరీదు శ్రీనివాసరావు, ఈశ్వరరావు, వీరంకి శివనాగేశ్వరరావు పాల్గొని సేవలందించారు. **ఉంగుటూరు :** ఉంగుటూరు, తేలప్రోలు, తుట్టగుంట, ఆముదాలపల్లి, లంకపల్లి, ఓంద్రం పాడు, మానికొండ, వేమండ, ముక్కపాడు, గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాల వద్ద విశేష పూజలు జరిపి, అన్నదానం చేశారు. ఆముదాలపల్లిలో గంటా శ్రీనివాస్, తుట్టగుంటలో సర్పంచ్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, తేలప్రోలులో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు వింతా శ్రీనివాస్ రెడ్డి తదితరులు కుటుంబ సమేతంగా హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

హనుమాన్ శోభాయాత్ర

ఉయ్యూరు : జై వీర హనుమాన్ నామ స్మరణ గురువారం ఉయ్యూరులో మార్మోగింది. హనుమజ్జయంతిని పురస్కరించుకుని హనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. బస్‌స్టాండ్ సెంటర్ దాసాంజనేయస్వామి దేవస్థానం, లక్ష్మీ గణపతి ఆలయంలో పూజల అనంతరం శోభాయాత్ర ప్రధాన రహదారిలో వీరమ్మ ఆలయం, కాటూరు రోడ్డు, శివాలయం రోడ్డు, పాత స్టేట్‌బ్యాంక్‌రోడ్డు, తోట్లవల్లూరు రోడ్డుల మీదుగా సాగింది. భక్తులు కాషాయ జెండాలు కట్టి శోభాయాత్రలో పాల్గొన్నారు.

జంక్షన్ అభయాంజనేయస్వామి లడ్డూ ప్రసాదం వేలం

హనుమాన్‌జంక్షన్ : జంక్షన్ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా భక్తులు సమర్పించిన మూడు ప్రసాదం లడ్డూలకు దేవస్థానం ఈవో పి.తారకేశ్వరరావు గురువారం వేలం నిర్వహించారు. తవ్వా పూర్ణచంద్రరావు సమర్పించిన 18 కేజీల లడ్డూను వేమూరి శ్రీనివాసరావు రూ.10 వేలకు, బోడిచర్ల రాంబాబు అందించిన 25 కేజీల లడ్డూను మేకా సత్యనారాయణ రూ.20,500లకు, మరో భక్తుడు అందించిన 14 కేజీల లడ్డూను చందక శివ రూ.21 వేలకు సొంతం చేసుకున్నారు. కూటమి నాయకులు వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి తదితరులు పాల్గొన్నారు.











వైభవంగా అంకమ్మతల్లి జాతర



పూజలో పాల్గొన్న జంపాన వంశస్తుల ఆడపడుచులు

ఉయ్యూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో జంపాన వారి అంకమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. భోగేంద్రుడు బజార్‌లో ఉన్న అంకమ్మతల్లి ఆలయం వద్ద గురువారం జంపాన వారి ఆడపడుచులతో పాటు పలువురు పూజలు జరిపారు. అమ్మవారికి అంక గుడారం నిర్వహించగా భక్తులు తరలివచ్చారు.

బాధిత కుటుంబాలకు చలసాని ఆర్థిక సాయం

కంకిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాల వల్ల నష్ట పోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని అమ్మాజి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చలసాని అరుణ ప్రసాద్ అన్నారు. భారీ వర్షాల కారణంగా నష్ట పోయిన కుటుంబాలకు రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం ఆయన అందజేశారు. నెప్పల్లి గ్రామంలో చేరగుడి వరలక్ష్మీ, అప్పికట్ల మాణిక్యం కుటుంబ సభ్యులు తీవ్రంగా నష్ట పోయారని తెలియజేశారు. తన వంతు రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. నెప్పల్లి గ్రామ టీడీపీ అధ్యక్షులు కొలుసు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక సమీక్షతోనే అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పుస్తకం చదివిన తరువాత సమీక్ష నిర్వహించడం ద్వారా చదివిన విషయాలపై అవగాహన పెరుగుతుందని విశ్రాంత ఉపాధ్యాయుడు లంక జగన్మోహనరావు విద్యార్థులకు సూచించారు. వీరవల్లి గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో గురువారం పుస్తక సమీక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రహించిన సారాంశాన్ని సమీక్ష ద్వారా మాట్లాడించారు.

సీపీఎం శిక్షణా తరగతులు

హనుమాన్‌జంక్షన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూన్ 1 నుంచి మూడు రోజులు పాటు ముఖ్య కార్యకర్తలు, నాయకులకు రాజకీయ శిక్షణా తరగతులు హనుమాన్‌జంక్షన్‌లో నిర్వహిస్తున్నట్లు బాపులపాడు మండల కార్యదర్శి బేత శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం రాష్ట్ర స్థాయి నాయకులు వి.శ్రీనివాసరావు వై.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకట్రావు, వి.రాంభూపాల్ తదితరులు హాజరవుతారని తెలిపారు.







ప్రకటన

నా క్లయింటు సంజాయిషీ పొంది ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా. ఈదిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని పాతూరి ఆదిశేషులు గారి కుమారుడు పాతూరి ప్రతాప్ గారు ది.27-07-2015న శ్రీ గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.5098/2015రుగా రిజిష్టర్డు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా క్రయము పొంది తదాది వారు సదరాస్తిని సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారని తెలుపుచున్నారు. యిట్టి స్థితిలో ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పాతూరి ఆదిశేషులు గారి కుమారుడు పాతూరి ప్రతాప్ గారు అమ్మచూపగా, నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా అస్తిని క్రయము చేయదలచి క్రయము ఖరారు చేసుకొని ఉన్నారు. కావున ఎవరికైననూ ఈ దిగువ షెడ్యూలు అస్తి పై గాని, ఎవరికైననూ ఏవిధమైన హక్కులుగాని, చెల్లదగు క్లయిములు గాని, మరి ఏవిధమైన అభ్యంతరములు గాని, ఉన్న యెడల, వారు ఈ ప్రకటన తేది లగాయతు 07రోజుల వ్యవధి లోపుగా మాకు అందేలాగా తగు సాక్ష్యాధార పత్రముల కాపీలతో లిఖిత పూర్వకముగా రిజిష్టరు పోస్టులో తిరుగు చీటితో సహా యీ దిగువ చిరునామాకు తెలియజేయవలసినది. సదరు గడువు తేదీలోగా చట్ట ప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములుగాని, క్లయములు గానీ, రాని యెడల షెడ్యూలు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా ఎంచి, నా క్లయింటు షెడ్యూలు ఆస్తిని క్రయము పొంది వారి పేర రిజిష్టర్డు క్రయదస్తావేజు పొందగలరనియు, ఆదర్మిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు గానీ, క్లయములుగానీ, నా క్లయింటును గానీ, షెడ్యూలు ఆస్తిని గానీ, చట్టపరంగా బైండు చేయజాలవనియు, నా క్లయింటు పొందు క్రయమును భంగము చేయజాలవనియూ, ఇందుమూలముగా తెలియచేయటమైనది. **షెడ్యూలు :** కృష్ణా జిల్లా, శ్రీ గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, గన్నవరం మండలం, వెదురుపావులూరు శివారు ముస్తాబాద గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, వెదురుపావులూరు గ్రామ ఆర్.యస్.నెం.121/3ఎరు దాఖలా య.0.58 సెంట్లు శేరీ పల్లం భూమికి **హద్దులు :** తూర్పు : కొట్టే మహేష్ గారి భూమి, దక్షిణం: సంకా వెంకట విశ్వేశరరావు గారి భూమి, పడమర : గూడపాటి లక్ష్మీ నారాయణ గారి భూమి, ఉత్తరం : బొబ్బూరి వెంకటేశ్వరరావు గారి భూమి

ఆర్.కృష్ణ, అడ్వకేట్, డో.నెం. 30-22-69, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002. సెల్ : 9885942416.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999

AJB-235085

PLOTS FOR SALE

» విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్‌కు 12 కి.మీ., ప్రపోజ్డ్ ఇన్నర్‌రింగ్ రోడ్‌కు 8 Km, ప్రపోజ్డ్ ఔటర్ రింగ్ రోడ్‌కి 4 Km, దూరంలో ప్రపోజ్డ్ 4 లైన్స్ రోడ్డు ప్రక్కన CRDA LAYOUT ప్లాట్లు కలవు. సంప్ర:70978 98989

AJB- 235116

WANTED

» మచిలీపట్నం, బైపాస్‌రోడ్ లోని కృష్ణవేణి ITI కాలేజిలో పనిచేయుటకు B.Tech ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ / మెకానికల్ / కంప్యూటర్ సైన్స్ చదివిన వారు కావలెను. కాలేజి ఆవరణలో ఉచిత వసతి కలదు. 98486 79360

AJB - 225935

» కానూరు లోని Lift Manfacturing companyలో పనిచేయుటకు లేడి టెలికాలర్స్ & సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M) మరియు హెల్పర్స్ Age : 21 to 30 కావలెను. సంప్ర॥ 8977987979.

AJG-239166

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడిపిటి









ప్రధాన ఆలయంలో, ఘాట్ రోడ్డులో, పాత మెట్ల మార్గంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఈవో శీనా నాయక్



శ్రీ ఆంజనేయం..

» ఇంద్రకీలాద్రిపై హనుమజ్జయంతి ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి, మే 22 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో క్షేత్రపాలక శ్రీఆంజనేయస్వామి, ఘాట్‌రోడ్డులో, పాతమెట్లు మార్గంలోని ఆలయాలలో అభిషేకాలు, నాగవల్లీ దళార్చన, రుద్రసహిత మన్యుసూక్త హోమ కార్యక్రమాలు, పూర్ణాహుతి మంత్రపూర్వకంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉప ప్రధాన అర్చకుడు శంకర శాండిల్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌర్ణమికి స్వర్ణకవచ, వజ్ర కిరీటధారిణిగా

దర్శనమివ్వనున్న కనకదుర్గమ్మ



ఇంద్రకీలాద్రి, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల సన్నిధిలో వైదిక కార్యక్రమాలు మరింత వైభవంగా జరిగేందుకు, నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు, ఆషాఢ, శ్రావణ మాసాలలో ఏర్పాట్లపై ఆలయ ఈవో వీకే శీనా నాయక్ గురువారం దేవస్థానం వైదిక కమిటీ, ప్రధాన అర్చకులు, వేద పండితులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవదాయశాఖ కార్యదర్శి, కమిషనర్ నిర్వహించిన సమావేశంలో నిర్దేశం చేసిన అంశాలను వైదిక కమిటీ సభ్యులకు వివరించారు. ప్రతి పౌర్ణమి రోజున కనకదుర్గమ్మ స్వర్ణకవచంతో భక్తులకు దర్శనమిస్తుండగా, ఇకపై స్వర్ణ కవచం, వజ్ర కిరీటంతో దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రతిభక్తునికి అమ్మవారి కుంకుమ అందేలా చూడటం, ఆర్జిత సేవలు సమయానికి ప్రారంభించడం, నివేదనలు ఆగమ శాస్త్రం ప్రకారం జరపటం, కొత్త సేవలు ప్రారంభించడానికి శాస్త్ర ప్రమాణాలు తెలియజేయాలని ఈవో కోరారు. దేవతామూర్తుల అలంకరణ, వస్త్రాలు వైభవంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వరశాస్త్రి, సుందరబాబు, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, కోట రవికుమార్, ఆర్.శ్రీనివాస శాస్త్రి, ఏఈవోలు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 7317 మంది హాజరు

బెంజిసర్కిల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలకు గురువారం ఎన్టీఆర్ జిల్లా నుంచి 7317 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 7790 మంది దరఖాస్తు చేసుకోగా 7317 మంది పరీక్షకు హాజరయ్యారు. 93.93శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా కృష్ణాజిల్లా నుంచి 1011మంది దరఖాస్తు చేసుకోగా 974 మంది పరీక్షలకు హాజరయ్యారు. 96.34 శాతం నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నం సత్య కన్వెన్షన్ హాలులో శుక్రవారం జరగనున్న మినీ మహానాడును విజయవంతం చేయాలని కృష్ణాజిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ కోరారు. గురువారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే మహానాడు కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, వర్లకుమార్ రాజా, కాగిత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్ పాల్గొంటారన్నారు. వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన తీర్మానాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాస్థాయిలో చేసిన తీర్మానాలను కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడు కార్యక్రమంలో ప్రవేశపెడతారన్నారు. సమావేశంలో పార్టీ పదవులపై చర్చలు, అభిప్రాయ సేకరణ జరుగుతాయన్నారు. ప్రజాస్వామ్యయుతంగా పార్టీశ్రేణులు తమ అభిప్రాయాన్ని చెప్పుకునేందుకు ఇదొక చక్కటి అవకాశమన్నారు.



విద్యార్థి తండ్రిని సత్కరిస్తూ ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

కృష్ణా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి

» యూనివర్సిటీ అచీవర్స్ డేలో ఎంపీ బాలశౌరి

» విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

మచిలీపట్నం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయం(కేయూ) అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.40 కోట్లు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. కేయూలో గురువారం నిర్వహించిన అచీవర్స్ డేలో 238 మంది ఆర్ట్స్, సైన్సు విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను ఎంపీ బాలశౌరి, ఎస్పీ ఆర్.గంగాధరరావు అందజేశారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో అథ్లెటిక్ ట్రాక్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, టెన్నిస్ కోర్టు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి రూ.40 కోట్లు ప్రతిపాదనలు పంపారని, వాటిని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని, బెల్ ద్వారా సీఎస్ఆర్ నిధులు తీసుకొస్తామని బాలశౌరి తెలిపారు. చిన్న కుటుంబంలో జన్మించిన తాను విద్యను నమ్ముకుని ఉన్నత స్థాయికి ఎదిగానని ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఉపకులపతి ఆచార్య కె.రాంజీ డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, రిజిస్ట్రార్ ఎన్.ఉష, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ వైకే సుందరకృష్ణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సమన్వయకర్త డాక్టర్ కిషోర్ ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావమే సంచలనం

» నేడు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తోంది

» ఎన్టీఆర్ స్ఫూర్తిని చంద్రబాబు కొనసాగిస్తున్నారు

» జిల్లా మినీ మహానాడులో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం



ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలంటూ కార్యకర్త తెచ్చిన బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న నెట్టెం రఘురాం, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం తాతయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

ఇబ్రహీంపట్నం, మే 22(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ ఆవిర్భావమే ఒక గొప్ప సంచలనం. నేడు దేశ రాజకీయాలను ప్రభావితం చేయగలుగుతుందంటే అది స్వర్గీయ ఎన్టీఆర్ కృషి ఫలితమే. అరవై ఏళ్ల వయస్సులో పార్టీ స్థాపించి ప్రజలకు ఎనలేని సేవలందించిన ఎన్టీఆర్ స్ఫూర్తిని సీఎం నారా చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్నారు.' అని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం



తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

అన్నారు. గుంటుపల్లి సీపీ కన్వెన్షన్‌లో గురువారం పండుగలా నిర్వహించిన జిల్లా మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. తొలుత నేతలు పార్టీ జెండాను ఆవిష్కరించాక, జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ ప్రతిమకు నివాళులర్పించారు. సభకు నెట్టెం అధ్యక్షత వహించారు. జగన్‌లాంటి నియంతను తాను ఇప్పటివరకు చూడలేదని నెట్టెం అన్నారు. ఐదేళ్ల అరాచకపాలనలో టీడీపీ నేతలను, కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెట్టాడని, వాటన్నింటినీ తట్టుకుని, నిలబడి అధికారం సాధించుకున్న తర్వాత జరుగుతున్న తొలి మహానాడు ఇది అని ఆయన అన్నారు. జిల్లాలో భారీగా టీడీపీ సభ్యత్వాలను చేసినందుకు నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పని చేయాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ సంక్షేమానికి బాటలు వేస్తే, సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని, దేశంలోనే కృష్ణా - గోదావరి నదులను అనుసంధానం చేసిన మార్గదర్శకుడు చంద్రబాబు అని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, కడపలో జరిగే మహానాడును జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేద్దామని మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన పార్టీ టీడీపీ అని, అందులో సభ్యునిగా ఉండటం గర్వంగా ఉందని, దార్శనికుడు సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని, పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం తాతయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి రఫీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు జంపాల సీతారామయ్య, బొమ్మసాని సుబ్బారావు, కె.విజయబాబు, దారునాయక్, ఆనంద్ సూర్య పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన పార్టీశ్రేణులు

ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి జిల్లా మినీ మహానాడుకు పెద్ద సంఖ్యలో టీడీపీ కుటుంబ సభ్యులు తరలివచ్చారు. అధికారంలోకి వచ్చాక, ఎన్టీఆర్ జిల్లాగా ఏర్పడిన తర్వాత జరిగిన తొలి మహానాడు కావడంతో నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పార్టీ విధి విధానాలను, తీర్మానాలను ఆసక్తిగా విన్నారు. అనంతరం వచ్చిన వారికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు.

సూట్‌కేసు కంపెనీలు పెట్టే అలవాటు నాకు లేదు

» దమ్ముంటే లిక్కర్ స్కాం ఎవరి హయాంలో జరిగిందో చెప్పు

» మాజీ సీఎం జగన్‌కు ఎంపీ కేశినేని చిన్ని సవాల్

'నీలాగా సూట్‌కేసు కంపెనీలు పెట్టే అలవాటు నాకు లేదు. దమ్మూ ధైర్యం ఉంటే లిక్కర్ స్కాం ఎవరి హయాంలో జరిగిందో చెప్పాలి.' అని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సవాల్ విసిరారు. జగన్ రెడ్డీ నువ్వు కేవలం ఎమ్మెల్యేవి.. నేను ఎంపీని.. నాస్థాయి ఎక్కువ అని గ్రహించు.. నీలి మీడియాలో రాసే కంపెనీలు ఎక్కడున్నాయో చెప్పు. అని 'మినీ మహానాడు' వేదికగా చిన్ని నిలదీశారు. వైసీపీ గూండాలు, ఆకురౌడీలు దౌర్జన్యాలు దాడులు చేయాలని ప్రయత్నిస్తే తెలుగు తమ్ముళ్ల తిప్పి కొట్టాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకే తాను సమాధానం చెబుతానని, విదూషకులకు చెప్పబోనని స్పష్టం చేశారు.

ఎంపీ కేశినేని చిన్నిపై జగన్ ఆరోపణలు నిరాధారం

» మాజీ ఎంపీ కేశినేని నానీ పేటీఎం బ్యాచ్‌లో చేరారు

» స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి

'ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)పై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) పేటీఎం బ్యాచ్‌లో చేరారు. చిల్లరకు కక్కుర్తి పడి నాని చేసిన ఆరోపణలే జగన్ కూడా చేస్తున్నారు. బెంజిసర్కిల్‌లో కట్టిన హోటల్ ఎవరి పేరుపైన పెట్టావు? బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టి దగా చేశావు కాబట్టే గుమాస్తాలను డైరెక్టర్లుగా పెట్టుకున్నావు. బ్యాంకులను మోసం చేసిన నీతో మాట్లాడించేది తాడేపల్లి సైకో కాదా?' అని కేశినేని నానీని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి నిలదీశారు.

కొత్త బస్సులకు గ్రీన్‌సిగ్నల్

(3వ పేజీ తరువాయి)

ఈ నిబంధనలు రాక ముందే ఆర్టీసీ కొత్త బస్సులకు ఆర్డర్ ఇచ్చేసింది. ఆ బస్సులు డెలివరీ కావటానికి జాప్యం జరిగింది. చాసిస్‌లకు బాడీ బిల్డింగ్‌కు ఇచ్చిన తర్వాత ఆదేశాలు వచ్చాయి. ఈ ఆదేశాల గురించి ఆర్టీసీ అధికారులకు అవగాహన లేకపోవటం వల్ల బాడీ బిల్డింగ్ పూర్తి చేసుకున్న బస్సులను రిజిస్ట్రేషన్ చేయించటానికి పంపగా, రవాణా శాఖ అధికారులు తిరస్కరించారు. ఎఫ్‌పీఎస్‌ను ఏర్పాటు చేస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు.

ఎఫ్‌పీఎస్ అంటే..

ఎఫ్‌పీఎస్ అనేది ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటు చేసే వ్యవస్థ. ఇటీవల కాలంలో బస్సుల నుంచి పొగ వచ్చి కాలిపోతున్న ఉదంతాలను చూస్తున్నాం. ఇలాంటి సందర్భాల్లో ఈ వ్యవస్థ ద్వారా బస్సులో అగ్ని ప్రమాదాలను ముందే గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేయటంతో పాటు బస్సును కూడా కాపాడవచ్చు. డ్రైవర్ క్యాబిన్, ప్రయాణికుల కంపార్ట్‌మెంట్లలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ ఉపయోగిస్తారు. ఇవి అగ్ని ఎంత తీవ్రస్థాయిలో ఉన్నా మంటలను ఆర్పుతాయి. ఒకవేళ ఇంజన్ నుంచి మంటలు వచ్చినా ఫోమ్‌ను భారీగా వెదజల్లి ఆ బస్సు అగ్నికి ఆహుతి కాకుండా చేస్తాయి. ఒక ఎఫ్‌పీఎస్ ఏర్పాటుకు రూ.2 లక్షలు ఖర్చవుతుంది. అన్ని బస్సులకు ఈ బడ్జెట్ కేటాయించటం ఇప్పుడు ఆర్టీసీకి ఇబ్బందే. ఈ వ్యవస్థను బస్సు బాడీ బిల్డింగ్ సమయంలోనే ఏర్పాటు చేయాలి. కొత్త బస్సుల్లో ఏర్పాటు చేయాలంటే బాడీ బిల్డింగ్ మొత్తం తొలగించాలి. దీనికి ప్రతిగా ఫైర్ డిటెక్టివ్ అలారం (ఎఫ్‌డీఏ) ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారు. దీనిని డ్రైవర్ వద్ద ఏర్పాటు చేస్తారు. బస్సులో ఏ భాగం నుంచి పొగలు వచ్చినా అలారం మోగుతుంది. వెంటనే డ్రైవర్ ప్రయాణికులను అప్రమత్తం చేస్తాడు.

బహిష్కరణ

(3వ పేజీ తరువాయి)

గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని కోరుతూ నినాదాలు చేశారు.

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో చర్చలు జరిపినా వెనక్కి తగ్గని సభ్యులు

జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లి సమావేశపు హాల్ ఎదుట ఆందోళనకు దిగడంతో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనంద్‌కుమార్ వారి వద్దకు వెళ్లి చర్చలు జరిపారు. సభ్యులకు కనీస సమాచారం ఇచ్చే అంశంపై రెండు జిల్లాల కలెక్టర్‌లు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారని తెలిపారు. సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేసే అంశంపై ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాశామని, ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సభ్యులకు వివరించి సమావేశానికి హాజరుకావాలని కోరారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ప్రతిపాదనలను తోసిపుచ్చిన సభ్యులు సమావేశానికి హాజరుకాకుండా ఎడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌కు వెళ్లి అక్కడే ఉండిపోయారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడండి : చైర్‌పర్సన్

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధికారులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంపై జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ఏటా జెడ్పీ నుంచి రూ.40 కోట్లు తాగునీటి పథకాలకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మరో రూ.20 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని మండిపడ్డారు. తమ గ్రామమైన కొత్తూరులోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను తదితర మండలాల్లో తాగునీటి పథకాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీ నిధులతో చేపట్టిన పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు అధికారులు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులకు కనీస సమాచారం ఇవ్వని అధికారులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. జెడ్పీ జనరల్ ఫండ్స్ నుంచి సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేయాలని జెడ్పీ సీఈవోకు సూచిస్తే ఆడిట్ అభ్యంతరాలు వస్తాయని చెబుతూ, సాచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. రెండు జిల్లాల కలెక్టర్‌లు ఈ అంశాలపై దృష్టి సారించాలని కోరారు.

శ్రీకాకుళంలో మట్టి తవ్వకాలను ఆపండి

ఘంటసాల మండలం శ్రీకాకుళంలో 200లకు పైగా టిప్పర్లతో చెరువు మట్టిని రోజూ అక్రమంగా తరలించేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఘంటసాల జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ విషయం సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు తెలియజేయాలని చూస్తే గనులశాఖ అధికారులు ఈ సమావేశానికి రాలేదన్నారు. మట్టి తవ్వకాలపై కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు.

సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం : కలెక్టర్‌లు

కృష్ణా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశలు మాట్లాడుతూ, జిల్లా పరిషత్ సభ్యులకు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి అధికారులు కనీస సమాచారం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. సభ్యులకు గౌరవ వేతనం విడుదలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్ రాజ్, ఉమ్మడి జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్త్రీనిధి యాప్‌తో మహిళలకు మేలు

» డిజిటల్ విధానంలో రుణాల చెల్లింపుతో సమయం ఆదా, పారదర్శకత

» యాప్ ప్రారంభం సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్



స్త్రీనిధి యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వన్‌టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళల ఆర్థిక పురోగతిని మరింత వేగవంతం చేసేందుకు స్త్రీనిధి సంస్థ ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేసి, యాప్‌ను తీసుకురావడం అభినందనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం బస్‌స్టేషన్‌లో సెర్ప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్త్రీ నిధి యాప్‌ను సెర్ప్, స్త్రీనిధి, యూనియన్ బ్యాంకు అధికారులతో కలిసి మంత్రి ప్రారంభించారు. స్త్రీనిధి యాప్ ఉపయోగించి డిజిటల్ విధానంలో రుణాల చెల్లింపులతో సమయం ఆదా అవుతుందని, మరింత పారదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. యాప్ వాడకంపై రుణాలు తీసుకున్న మహిళలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. స్త్రీనిధి-ఆంధ్రప్రదేశ్, డిజిటల్ విధానం ద్వారా రుణాలను చెల్లించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల సహకారంతో పేద మహిళలకు రుణాలను మొబైల్ టెక్నాలజీ, బయోమెట్రిక్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా 48 గంటల్లోపు అందించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ రుణాల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయడానికి, ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత, భద్రమైన చెల్లింపుల్లో మరింత పురోగతిని సాధించడం కోసం ఈ యాప్‌ను రూపొందించినట్లు ఆయన తెలిపారు. డిజిటల్ పేమెంట్ యాప్‌లో యూనియన్ బ్యాంకును భాగస్వామిగా చేసుకున్నందుకు ఆనందంగా ఉందని యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు తెలిపారు. సెర్ప్ సంస్థలో స్త్రీనిధి అంతర్భాగమని, గ్రామీణ, పట్టణాల్లో ఉన్న పేద మహిళల ఆర్థికాభివృద్ధికి పాటుపడుతోందని సెర్ప్ సీఈవో వాకాటి కరుణ అన్నారు. స్త్రీనిధి, సెర్ప్, బ్యాంకు అధికారులు, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.



తమ స్థలంలో లారీని తొలగించాలని ఎస్ఐకి వినతి పత్రం ఇస్తున్న ఆర్టీసీ అధికారులు

తొలగిస్తారా.. వేలం వేయమంటారా!

» బస్‌స్టేషన్ నిర్మాణానికి అడ్డుగా శిథిల లారీ

» తోట్లవల్లూరు ఎస్ఐకి ఆర్టీసీ అధికారుల వినతి

తోట్లవల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : అనధికార మద్యం తరలిస్తూ పట్టుబడిన లారీని సీజ్ చేసి ముప్పై ఏళ్లుగా ఆర్టీసీ స్థలంలో ఉంచారని, తక్షణం శిథిల లారీనిని తొలగించాలని ఆర్టీసీ అధికారులు తోట్లవల్లూరు ఎస్ఐ అవినాష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. లేకుంటే తామే దానిని తొలగించి వేలం వేస్తామని చెప్పారు. వివరాల్లోకి వెళితే.. ప్రజావసరాల కోసం బస్‌స్టేషన్ నిర్మాణానికి సుమారు 25 సంవత్సరాల క్రితం పొట్లూరి రమేష్ తనకు చెందిన 12 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చారు. అయితే ఉయ్యూరు ఆర్టీసీ డిపోకు ఉచితంగా ఇచ్చిన స్థలాన్ని ఇంతకాలం అధికారులు నిరుపయోగంగా ఉంచారని, స్థలాన్ని తిరిగి తమకు స్వాధీన పర్చాలని దాత రమేష్ సీఎం చంద్రబాబుకు ఇటీవల లేఖ రాశారు. సీఎం సూచన మేరకు స్థలం స్వాధీనం చేసుకునేందుకు ఆర్టీసీ అధికారులు తరలివచ్చారు. విజయవాడ ఆర్టీసీ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం, కృష్ణాజిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎ.వాణిశ్రీ, ఉయ్యూరు ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ పి.పెద్దిరాజు, డిప్యూటీ ఈఈ జగదీష్, ఈఈ కె.రాజశేఖర్‌లు గురువారం సదరు స్థలాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మాకినేని దశరథరామయ్య అధికారులను కలిసి తన సూచనతోనే పొట్లూరి రమేష్ ఆర్టీసీకి స్థలాన్ని ఇచ్చారని, దాత పొట్లూరి రమేష్‌కు ఫోన్‌చేసి ఆర్టీసీ అధికారులతో మాట్లాడించారు. బహుళ అవసరాలకు ఉపయోగపడే విధంగా బస్‌స్టేషన్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో స్థలం వద్ద ఉన్న పాడుబడిన లారీని చూసిన అధికారులు స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ సీహెచ్ అవినాష్‌ను కలిశారు. బస్‌స్టేషన్ నిర్మాణానికి లారీ అడ్డుగా ఉందని, వెంటనే శిథిలమైన లారీని తొలగించాలని, లేకుంటే తామే వేలం వేసి వచ్చిన సొమ్మును ట్రెజరీలో జమచేస్తామని ఎస్ఐకి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి లారీ తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.



ముప్పై ఏళ్లుగా శిథిలమైన లారీ

వైభవంగా..

(3వ పేజీ తరువాయి)



అభయాంజనేయ స్వామిని దర్శించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

చింతమనేని ప్రభాకర్ దర్శించుకున్నారు. స్వామి వారికి తమలపాకు పూజ నిర్వహించారు. ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు.పూజ అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేమూరి శ్రీనివాసరావు దేవస్థానం తరఫున శేషవస్త్రంతో సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. కాగా, స్థానిక నూజివీడు రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సుందరకాండ పారాయణ యజ్ఞం ముగింపు సందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేకాలు, హోమం, సీతారాముల కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణ పాల్గొన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడె వెంకయ్య కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు. దేవస్థానం ఈవో తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇదేం పద్ధతి!

(3వ పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్న సమస్యలపైనా సమావేశంలో చర్చించాల్సి ఉంటే వీటిపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా వైసీపీ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్‌లతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు మధ్యాహ్నం రెండు గంటల వరకు ఖాళీగానే సమావేశపుహాలులో కూర్చుండి పోయారు. సమావేశం అర్ధగంట పాటు కూడా జరగకపోవడంతో అధికారుల సమయం వృథా అయ్యింది. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఈ సమావేశానికి హాజరువుతారని అధికారులు చెప్పారు. కృష్ణా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమం అనంతరం ఆయన ఈ సమావేశానికి బయలుదేరారు. సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారనే సమాచారంతో ఆయన ఆగిపోయారు.

దర్జాగా.. దర్జీ!

» ఇంటివద్దకే టైలరింగ్..

» వణుకూరులో సీనియర్ టైలర్ షేక్ కాలేషా వినూత్న ఆలోచన



వణుకూరులో మొబైల్ టైలరింగ్ సేవలందిస్తున్న షేక్ కాలేషా

రెడీమేడ్, డిజైన్ దుస్తుల కారణంగా టైలర్లకు చేతినిండా పని లేకుండా పోయిన ఈ రోజుల్లో వినూత్నంగా ఆలోచించాడు మండలంలోని వణుకూరుకు చెందిన సీనియర్ టైలర్ షేక్ కాలేషా. పని లేదని నిరుత్సాహపడ కుండా టైలరింగ్ సేవలను వినియోగదారుల ఇంటి వద్దకు తీసుకెళ్లి దర్జాగా దర్జీ సేవలందిస్తున్నాడు. అందుకోసం తొలుత ఓ రిక్షాను కొన్నాడు. ఎక్కడికయినా తీసుకెళ్లేందుకు అనుగుణంగా దానికి మార్పులు చేసి కుట్టు మిషన్‌ను అనుసంధానించాడు. గ్రామంలోని కాలనీల్లో తిరుగుతూ ఇళ్ల వద్దే పాత, చిరిగిన దుస్తులు కుట్టడం ప్రారంభించాడు. తన సేవలకు మంచి ఆదరణ లభించడంతో టీవీఎస్ ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేసి పొరుగూళ్లకు తన సేవలు విస్తరించాడు. రోజుకో గ్రామం తిరుగుతూ ఉపాధి పొందుతున్నాడు. అవసరం ఉన్నవాళ్లు కాలేషాకు ఫోన్లు చేసి మరీ దుస్తులు కుట్టించుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-పెనమలూరు)

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

ట్యాంకర్‌తో మంచినీటి సరఫరా

గుడివాడ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మల్లాయిపాలెం పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ తదితర ప్రాంతాలో మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ సొంత ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి గురువారం ఉచిత మంచినీటిని ప్రజలకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ మండలంలోని ప్రజల దాహార్తిని తీర్చటానికి వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తాగునీటి సరఫరా లేని ప్రదేశంలో వాటర్ ట్యాంకర్ పంపించనున్నామన్నారు.



లక్ష్మీనగర్ కాలనీలో మంచినీరు సరఫరా చేస్తున్న వాటర్ ట్యాంకర్



పిల్లర్ వద్ద ప్రమాద సూచికబోర్డులను ఏర్పాటుచేసిన కాంట్రాక్టర్

ఎట్టకేలకు ప్రమాదసూచికల ఏర్పాటు

గుడివాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : బుధవారం స్థానిక బందరు రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పిల్లర్‌ను ఢీకొట్టి లారీ క్యాబిన్ తుక్కుతుక్కైన విషయం విదితమే. ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనానికి కాంట్రాక్టర్ స్పందించి గురువారం ప్రమాద స్థలం వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు.

ఒక్క ఎకరా మునగనివ్వను

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతాంగ ప్రయోజనాలకు ప్రాధాన్యనిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని, వర్షాల వల్ల నియోజకవర్గంలో ఒక్క ఎకరా పంట మునగనివ్వనని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సిద్ధాంతంలో పాలకోడు డ్రెయిన్‌లో పూడికతీత పనులను పూజా కార్యక్రమాలు నిర్వహించి ఎమ్మెల్యే రైతులతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయంగా ప్రొక్లైయినర్ నడుపుతూ డ్రెయిన్‌లోని పూడికను ఎమ్మెల్యే రాము తొలగించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలోని ప్రధాన డ్రెయిన్లలో మూడు కోట్ల రూపాయలతో పూడికతీత పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూసీ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, డ్రెయినేజీ డీఈ గణపతి, ఏఈ కుమార్, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, కూటమి పార్టీల నాయకులు కంచనపల్లి సుబ్రహ్మణ్యం, బొప్పన శివ ప్రసాద్, వీరమాచినేని శివ ప్రసాద్, నాగ వెంకటేశ్వరరావు, తనకోటి, పెద్దిబోయిన రాజు, లింగం చిట్టిబాబు, పేర్ని జగన్, అడుసుమిల్లి శివ రాజేష్, బుర్ర నాగేశ్వరరావు, చలసాని శ్రీధర్, ఆంజనేయులు, వీరవరపు వంశీకృష్ణ, అట్లూరి స్వరూప్, మేక వెంకటేశ్వరరావు, అనిల్, శివన్నారాయణ, మెండం వీర్రాజు, కాశీయా, విజయ్, రైతులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



బోరువేసే యంత్రానికి పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ దంపతులు

పంపు నిర్మాణానికి పూజలు

గుడ్లవల్లేరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : సింగలూరులో తాగునీటి సమస్యను అధిగమించేందుకు గ్రామానికి చెందిన భాగ్యవిధాతా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ సొంత నిధులతో బోర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కాగా గురువారం బోర్‌కు సంబంధించి పూజా కార్యక్రమాలు శ్యామ్‌కుమార్, సరస్వతి దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాలిసెట్టి అర్జునరావు, కార్యదర్శి చాపరాల రాజేష్, గద్దే సోమరాజు, ఉద్దంటి నాగమల్లేరుశ్వరరావు, కోటా ఫైడేశ్వరరావు, మాచర్ల రమణయ్య, బిట్లా అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహప్రతిష్ఠా మహోత్సవాలు

పామర్రు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హిందూ సంస్కృతి సాంప్రదాయాలు ధార్మికతను పెంపొందించుకోవడం కోసం గ్రామాల్లో హిందూ దేవాలయాల నిర్మాణాలకు భక్తులు, దాతలు మరింత ముందుకు రావాలని ప్రముఖ వేదాంత చార్యులు చలమచర్ల మురళి కృష్ణమాచార్యులు పిలుపునిచ్చారు. పట్టణంలోని శివాలయం ప్రాంగణంలో నూతనంగా నెలకొల్పిన హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి సన్నిధిలో స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు తాడిశెట్టి పూర్ణయ్య,నాగేశ్వరరావు(పాము)వంశీయుల ఆధ్వర్యంలో గురువారం జరిగాయి. ఈసందర్భంగా స్వామివార్ల 108 కలశాలకు గ్రామోత్సవం నిర్వహించారు. యజ్ఞం, యాగాది క్రతులను ఘనంగా నిర్వహించారు. పండితులు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.



కలశాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

రోడ్డు ప్రమాద మృతులకు నివాళి

పమిడిముక్కల, మే 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తాడింకి, గోపువానిపాలేనికి చెందిన దుర్గ, విజయలక్ష్మిలకు ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఘన నివాళులర్పించారు. జిల్లా ఆశావర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో వీరంకిలాకు సెంటర్‌లో ఏర్పాటుచేసిన సంతాప కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ధనశ్రీ, సహాయ కార్యదర్శి స్వరూప, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శివనాగేంద్రం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గంగాధర్, హేమలత, కోమలి, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఆశావర్కర్ల యూనియన్ సభ్యులు

నీటి తీరువా చెల్లించాలి

పమిడిముక్కల, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో రైతులు వారి పొలాలకు సంబంధించి నీటి తీరువా(భూమి శిస్తు) గ్రామ సచివాలయాల్లో చెల్లించి సహకరించాలని మండల తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ తెలిపారు. రైతుల నుంచి వసూలుచేసిన నీటితీరువాను సాగునీటి సంఘాలకు బదిలీచేసి తదుపరి వాటితో పంటకాల్వలు బాగజేసుకునేందుకు ఉపయోగించడం జరుగుతుందన్నారు. రైతులు నీటితీరువాను వీలైన త్వరగా గ్రామసచివాయాల్లో చెల్లించి సహకరించాలని కోరారు.

ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు గౌరవ వేతనాలు విడుదల చేయాలి

గుడివాడ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ రూరల్ మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు గౌరవవేతనం లభించకపోవటంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్ల నుంచి ఎంపీటీసీలకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం విడుదల కావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు గౌరవ వేతనం విడుదల కాలేదు. ఎంపీటీసీలు కనీస అవసరాలకు కూడా గౌరవ వేతనం ఇవ్వకపోవటం వల్ల ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ ఉత్సవ విగ్రహాలు లాగా ఉండటమే కానీ కనీసం ప్రభుత్వం నుంచి రావాల్సిన వేతనాలు తదితరాలు అందకపోవటం పట్ల నిరసన తెలిపారు. గురువారం నిర్వహించిన మండల సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌ల గౌరవ వేతనంపై పెద్ద ఘర్షణ వాతావరణం జరగటం కొసమెరుపు. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి ఎంపీటీసీలకు , సర్పంచ్‌లకు, అధికారులకు రావాల్సిన గౌరవ వేతనం అందజేయాలని కోరుతున్నారు.

అకాల వర్షాలతో రహదారులు అధ్వానం



మొవ్వలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి దుస్థితి

కూచిపూడి, మే 22 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో మొవ్వలోని ఆర్ అండ్‌బీ, అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మొవ్వ ప్రధాన రహదారి గోతులమయంగా మారటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గుంతల్లో నిలబడిన వర్షపు నీటితో పాదచారులు అవస్థలు పడాల్సి వచ్చింది. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. మొవ్వ బస్టాండ్ ప్రాంతం, కూచిపూడి, పెదపూడి, బార్లపూడి రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మొవ్వ నుంచి పెదముత్తేవి వెళ్లే ప్రధాన రహదారిలో కొండవరం వద్ద రహదారి చెరువును తలపిస్తుంది. గ్రామాల్లో రహదారులు చిత్తడిగా మారాయి. యద్దనపూడి వద్ద రహదారి చిత్తడిగా మారటంతో పలువురు వాహనదారులు అదుపు తప్పి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత అధికారులు గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొండవరంలో చెరువును తలపిస్తున్న రహదారి

వృద్ధులకు చీరల పంపిణీ

గుడివాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో మునిబోయిన వెంకటేశ్వరరావు 8వ వర్ధంతి సందర్భం గా ఆయన జ్ఞాపకార్థం కుమారుడు రాధాకృష్ణ గురువారం స్థానిక కర్ల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తిరుపతయ్య, తాతారావు, మునీంద్ర, హరిబాబు, వృద్ధాశ్రమం నిర్వహకులు కర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న రాధాకృష్ణ

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

గుడివాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరుజిల్లా కైకలూరు మండలం వరహాపట్నానికి చెందిన కట్టా గంగాధర్ నాగవరప్పాడులోని చిన్న అల్లుడు ఇంటికి వచ్చి వెళ్ళుతూ రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన ఏపి 16 బిఎక్స్ 1896 బైక్ బలంగా ఢీకొనడంతో గంగాధర్ రెండు భూజాలకు గాయాలయ్యాయి. గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శేషుకుమార్ తెలిపారు.

డీఎంయూలను కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లంకా సురేంద్ర

గుడివాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉపయోగకరంగా ఉన్న డీఎంయూ(సంచార వాహనాలు)లను రద్దు చేయాలని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించటం విచారకరమని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు లంకా సురేంద్ర, ఏఐటీయూసీ నాయకులు కొమ్ము సురేష్‌లు అన్నారు. గురువారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమే తక్షణమే ప్రజావ్యతిరేక నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. డీఎంయూలను యథావిధిగా కొనసాగించి, నిత్యావసర వస్తువులన్నింటిని ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు రేపాని కొండలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



పూజాసామాగ్రిని శిరస్సుపై ధరించి తీసుకువస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకువెళ్తూ ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ఆంజనేయస్వామి శక్తిని ప్రసాదించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. గురువారం స్థానిక బంటుమిల్లి రోడ్డులోని అభయాంజనేస్వామి దేవస్థానంలో స్వామిని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక రైతుబజారువద్ద గల భక్తాంజనేయస్వామి దేవస్థానం, పెద ఎరుకపాడులోని దాసాంజనేయస్వామి దేవస్థానాల్లో జరుగుతున్న హనుమజ్జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్,నాయకులుమురళీ, జగన్మోహనరావు, సాంబశివరావు, మణ్యేశ్వరరావు, శేషు, కిషోర్, మహేష్, పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక బంటుమిల్లిరోడ్డులోని అభయాంజనేయస్వామి దేవస్థానం, నాగవరప్పాడులోని దాసాంజనేయస్వామి దేవస్థానం, గౌరీశంకరస్వామి దేవస్థాన ఉపాలయమైన ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, పెద ఎరుకపాడులోని ఆంజనేయస్వామి దేవస్థానం తదితర ఆలయాల్లో జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, నావల్లిల అర్చన, హోమం నిర్వహించారు. రెడ్డిపాలెంలోని వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థాన దత్తత ఆలయమైన అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, సాయంత్రం స్వామివారి శాంతికల్యాణం ఘనంగా నిర్వహించారు. గుడ్లవల్లేరు సంత వద్ద పోల్‌రాజ్ కెనాల్ వద్ద ఆంజనేయ స్వామి మందిరంలో, అంగలూరు ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అంగలూరులో 2000 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సమారాధనను గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ ప్రారంభించారు.

గుడివాడ రూరల్ : చిన ఎరుకపాడులో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా హనుమంతునికి ప్రత్యేక పూజలు చేశారు. దొండపాడు, మోటూరు, బొమ్ములూరు, తట్టివర్రు తదితర హనుమాన్ ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. యువత ప్రత్యేకంగా హనుమాన్ విగ్రహాలతో బైక్‌ల మీద ర్యాలీ నిర్వహించారు.

కూచిపూడి : హనుమజ్జయంతి వేడుకలను పలు ప్రాంతాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కూచిపూడి, కోసూరు, చినముత్తేవి, అయ్యంకి, యద్దనపూడి, కారకంపాడు అడ్డరోడ్డు ఆలయాల వద్ద తమలపాకుల పూజ, స్వామి కల్యాణం, హనుమాన్ చాలీసా పారాయణం, విశేష పూజలు జరిగాయి. అనంతరం పలు గ్రామాల్లో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పామర్రు :స్థానిక ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద గల వీరాంజనేయ దేవస్థానంలో గురువారం జరిగిన హనుమజ్జయంతోత్సవాల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొని ప్రత్యేక పూజాధికాలు చేశారు. తొలుత ఆలయ మర్యాదలతో ఈవో ప్రసాదరావు ఆలయ సిబ్బంది కుమార్‌రాజాను ఘనంగా సత్కరించారు. ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను పురస్కరించుకుని వేకువ జామునే స్వామికి విశేష అభిషేకాలు, నాగసింధూర, లక్ష ఆకుల పూజాదికాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన అన్నసమారాధన ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఏఎంసీ మండపాక శంకర్‌బాబు, జనసేన నియోజకవర్గఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ , వెన్నాశ్రీను తదితరులు పాల్గొన్నారు. కనుమూరులోని అభయాంజనేయస్వామి దేవస్థానంతోపాటుగా పామర్రులోని వీరాంజనేయస్వామి దేవస్థానం, అడ్డాడ ఆంజనేయస్వామి, కురుమద్దాలి ఆంజనేయ స్వామిదేవాలయం, పామర్రుసాయిమందిరంలోగల దక్షిణ ముఖ అంజనేయుడి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి.

పెదపారుపూడి : దేవాలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి రక్షాబంధన అఖండ దీపారాధన , ప్రత్యేక పూజలు నిర్వహించామని దేవాలయ అర్చకులు సూరిపాది వీర వెంకట వర ప్రసాద్ తెలిపారు. పెదపారుపూడి అభయాంజనేయస్వామి ఆలయంలో లక్ష్మోజి ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. యలమర్రులోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ఉదయం 6 గంటల నుంచి స్వామివారి ఆలయాల్లో జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు సూరపనేని వెంకట సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు చెరుకూరి రమేష్ వేడుకల్లో స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

పమిడిముక్కల : హనుమజ్జయంతి పురస్కరించుకుని పమిడిముక్కలలో ఆంజనేయస్వామి ఆలయాల వద్ద గురువారం పూజా కార్యకార్యక్రమాలు, హోమాలు, అభిషేకాలు పెద్దయెత్తున్న నిర్వహించారు. గోపువానిపాలెం దాసాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్న సమారాధన లాంఛనంగా ప్రారంభించారు. ఆయకమిటీ ఆయనకు సాదరస్వాగతం పలికి పూజలు చేయించారు. స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు. పలుగ్రామాల్లో ఆంజ నేయస్వామి ఆలయల్లో హనుమజ్జయంతి భక్తి శ్రద్ధలతో నిర్వహించి భక్తులకు అన్న సమారాధన చేశారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో గురువారం హనుమజ్జయంతి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. భద్రిరాజుపాలెం కరకట్టపైన ఆలయం వద్ద, యాకమూరు, గరికపర్రు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందలాదిగా భక్తులు పాల్గొని హనుమంతుడిని దర్శించుకున్నారు. ఆలయాల వద్ద భారీగా అన్నసమారాధనలు జరిగాయి.




చిన్న ఎరుకపాడు అష్టలక్ష్మీ ఆలయంలో..



పామర్రులో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



భద్రిరాజుపాలెంలో..



విజయవాడ :స్వర్ణమల్టీప్లెక్స్	మచిలీపట్నం :సిరికాంప్లెక్స్
విజయవాడ :జి3 రాజ్ యువరాజ్	మచిలీపట్నం :వరం PVR INOX
విజయవాడ :ఊర్వశి INOX	గుడివాడ :జి3 సింధూర
ఎంజిరోడ్ :లైలా INOX	పోరంకి :బాలాజీసినీవిల్లా
లబ్బీపేట :పివిపి సినీపోలీస్	కంకిపాడు :శ్రీరామచంద్ర
లబ్బీపేట :పివిఆర్‌సినిమాస్	పామర్రు :శివరామ్
బెంజిసర్కిల్ :క్యాపిటల్ సినిమాస్	చల్లపల్లి :సాగర్
పటమట :LEPL INOX	పెడన :శ్రీకృష్ణతులసి
అశోక్‌నగర్ :పవర్‌సినీపోలీస్	గుడ్లవల్లేరు :రామకృష్ణ
వన్‌టౌన్ :సౌమ్య	నూజివీడు :సత్యనారాయణ
భవానీపురం :స్వాతి	కొండపల్లి :శివకృష్ణ
పాయకాపురం :తారాస్క్రీన్స్	మైలవరం :సంఘమిత్ర
గుణదల :రామ్ సినిమాస్	తిరువూరు :వెంకటేశ్వర
కానూరు :శ్రీవిజయలక్ష్మీ	

G3 MOVIES LLP release

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235085

WANTED
» మచిలీపట్నం, బైపాస్‌రోడ్ లోని కృష్ణవేణి ITI కాలేజిలో పనిచేయుటకు B.Tech ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ / మెకానికల్ / కంప్యూటర్ సైన్స్ చదివిన వారు కావలెను. కాలేజి ఆవరణలో ఉచిత వసతి కలదు. 98486 79360
AJB - 225935

PLOTS FOR SALE
» విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్‌కు 12 కి.మీ., ప్రపోజ్ ఇన్నర్‌రింగ్ రోడ్‌కు 8 Km, ప్రపోజ్ ఔటర్ రింగ్ రోడ్‌కి 4 Km, దూరంలో ప్రపోజ్ 4 లైన్స్ రోడ్డు ప్రక్కన CRDA LAYOUT ప్లాట్లు కలవు. సంప్ర:70978 98989
AJB- 235116

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ॥ 220/- ప్రతి అదనపు లైనుకు రూ. 45/- కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464 తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737



ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
అందిస్తోంది
25% సిటీ / జిల్లా ప్రకటనలకు డిస్కౌంట్
15% జోన్ ప్రకటనలకు డిస్కౌంట్
మచిలీపట్నం, పెడన : 99854 11610, చల్లపల్లి : 99854 11331, గుడివాడ : 99854 09737, ఉయ్యూరు, పామర్రు : 99854 09737

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 09737, 99854 11610

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604, డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530	

ఖాళీ పోస్టులు, పదోన్నతుల వివరాలివ్వండి: యూటీఎఫ్ వినతి



మచిలీపట్నం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల బదిలీల ప్రక్రియ ప్రారంభమైన దృష్ట్యా జిల్లాలోని ఖాళీ పోస్టులు, పదోన్నతుల వివరాలు తెలియజేయాలని కోరుతూ డీఈవో రామారావుకు యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బి. కనకారావు, గౌరవాధ్యక్షుడు జె.లెనిన్‌బాబు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. పాఠశాలల పునః వ్యవస్థీకరణ సందర్భంగా వివరాలను తెలియజేయాలని కోరారు.



ఎంపీ బాలశౌరికి అంచనా నివేదిక అందజేసి, కృతజ్ఞతలు తెలియజేస్తున్న కంకటావ గ్రామస్థులు

వంతెన మరమ్మతులకు నిధులు మంజూరు

గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : యలకుర్రు కాల్వ వంతెన మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేసిన ఎంపీ బాలశౌరికి కంకటావ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ రూపొందించిన అంచనాల నివేదికను గురువారం ఎంపీ బాలశౌరికి అందజేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్‌కు కంకటావ గ్రామ పంచాయతీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. శీరం సంతోష్‌నాయుడు, బూరగడ్డ భాను, సమ్మెట గణపతిరావు, కమ్మిల శ్రీనివాసరావు, కమ్మిల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



చిట్టిపాలెంలో రైతులకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ కుంచెనాని, మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

మచిలీపట్నం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. అరిశేపల్లి శివారు చిట్టిపాలెం గ్రామంలో రైతులకు 50 శాతం సబ్సిడీ పై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచేనాని మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన టీడీపీ నాయకులు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావాలన్నారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, రూరల్ మండల టీడీపీ జనరల్ సెక్రటరీ కాటం మధు, నాయకులు లంకే శేషగిరి, తలారి సోమశేఖర్, అమ్మిరెడ్డి శివ, పామర్తి లక్ష్మణ, చిట్టిబొమ్మ వనరాజు, బసవయ్య, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన గోపాలరావు భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

జేఎల్ఎం కుటుంబానికి ఆర్థిక సాయం

పెడన రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పెనుమల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో మరణించిన జేఎల్ఎం ధరావతు గోపాలరావు భార్యా నాగరాణికి రూ.4,56,500 ఆర్థిక సహాయం అందజేశారు. మచిలీపట్నం సర్కిల్ అధికారులు, మచిలీపట్నం డివిజన్ కార్మికులు ఈ మొత్తం సమకూర్చారు. ప్రమాదం జరిగిన సమయంలో రెండున్నర లక్షల రూపాయలు అందించగా గురువారం నాగరాణికి మిగిలిన మొత్తం డీఈ సిహెచ్ఆర్‌కె మాణిక్యాలరావు ద్వారా అందజేశారు. నాగరాణి కుటుంబ సభ్యులకు ఉద్యోగులు, కార్మికుల అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.



ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మచిలీపట్నం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎన్నికయిన అధ్యక్ష, కార్యదర్శులు పని చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతనంగా ఎన్నికయిన నగర టీడీపీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బచ్చుల అనిల్ కుమార్, కార్యదర్శుల సమావేశంలో గోపీచంద్ మాట్లాడారు. పార్టీ పటిష్టతకు, కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. టౌన్‌హాలు మాజీ అధ్యక్షుడు చిన్నం శివనాగేశ్వరరావు, టీడీపీ ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



పరాసుపేట ఆంజనేయస్వామి ఆలయంలో ఒంటె వాహన సేవ



ఈడేపల్లి ఆంజనేయస్వామికి వెండి కిరీటం సమర్పిస్తున్న భక్తులు



చల్లపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

మచిలీపట్నం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి జిల్లాలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. బందరులో సమర్థ రామదాసు నిర్మించిన సువర్చలా సమేత ఆంజనేయస్వామివారి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కార్యనిర్వహణాధికారి టి.వి.వి.మోహనరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈడేపల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారికి ఆళ్ల మాధవ వెండి కిరీటాన్ని బహూకరించారు. నగర టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన లోగిశెట్టి వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బచ్చుల అనిల్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, పివి ఫణికుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. సుల్తానగరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొడుగుపేట, బుట్టాయిపేట దత్తాశ్రమంలో, బచ్చుపేట ఆలయాల్లో హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. జవ్వారుపేటలోని పంచముఖ ఆంజనేయస్వామి కి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. **పెడన రూరల్ :** నడుపూరు, కూడూరు, నందిగామ, పెనుమల్లి, చెన్నూరు, ఉరివి, నందమూరు, చేవేంద్ర, జింజేరు, బల్లిపర్రు ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ నామ సంకీర్తనలు ఆలపించారు. అన్నసమారాధన చేశారు. **బంటుమిల్లి :** అర్తమూరు వీరాంజనేయ స్వామి ఆలయంలో నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కాగిత రవి కుమార్ దంపతులు అభిషేకం, తమలపాకు అర్చన జరిపారు. బంటుమిల్లి రామాలయంలో కొల్లా రాంబాబు, మద్ది ప్రసాద్ దంపతులు విశేష పూజలు చేశారు. పాశ్వాపురం సువర్చల సమేత ఆంజనేయస్వామి ఆలయంలో భజనలు, నగర సంకీర్తన, భారీ అన్నసమారాధన జరిగింది. **అవనిగడ్డ రూరల్ :** అశ్వారావుపాలెం కోదండ రామాలయం లో వేదపండితులు కాశీభొట్ల సురేష్ నారాయణరావు, యక్కటి ఏడుకొండలు దంపతులు విశేష పూజలు జరిపారు. హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. వేకనూరులో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దాదాపు నాలుగు వేల మందికి అన్నసమారాధన జరిగింది. **నాగాయలంక :** పలు గ్రామాల రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణ, అన్న సంతర్పణ నిర్వహించారు. **మోపిదేవి :** మోపిదేవి, పెదకళ్లేపల్లి, వెంకటాపురం, పెదప్రోలు, మోపిదేవి వార్పు గ్రామాల్లో హనుమాన్ చాలీసా, సహస్ర నామ పారాయణ చేసి, భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. **ఘంటసాల :** శ్రీకాకుళం గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు అన్నదాన కార్యక్రమాన్ని కూటమి నేత లు, ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. వందలాది మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు. రాష్ట్ర తెలుగుయువత నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కూటమి నేతలు కటారి తాతయ్య, కొండవీటి కోటి, కొండవీటి కృష్ణమూర్తి, మేకా శ్రీనివాసరావు, తమ్మన ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **కోడూరు :** కోడూరు ప్రధాన సెంటర్‌లో, వంతెన సెంటర్‌లో, జయపురం, నరసింహాపురం ఆంజనేయ స్వామి ఆలయాల్లోనూ, తూర్పు వైపు, నక్కవాని దారి, ఉల్లిపాలెం రామాలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. కోడూరు వంతెన సెంటర్‌లో ఎనిమిది వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. **చల్లపల్లి :** బస్టాండ్ సెంటర్లోని పంచముఖ అభయాంజనేయస్వామి ఆలయం, నారాయణరావునగర్‌లోని ఆలయం, ప్రసన్న భక్తాంజనేయస్వామి ఆల యం తదితర ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరిపారు. బస్టాండ్ సెంటరులోని శ్రీపంచముఖ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ ఛాలీసా పారాయణ జరిగిం ది. అయ్యప్పస్వామి క్షేత్రంలోని దాసాంజనేయస్వామికి పూజలు చేశారు. చల్లపల్లితో పాటు రామానగరం, లక్ష్మీపురం, మంగళాపురం, మాజేరు, వక్కలగడ్డ, పురిటిగడ్డ తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యే క పూజలు జరిగాయి. నారాయణరావునగర్‌లోని ప్రసన్న భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద మురళీకోలాట ప్రదర్శన జరిగింది. **కృత్తివెన్ను :** అడ్డపర్ర గ్రామంలో హనుమజ్జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పూజలు నిర్వహించారు. చినగొల్లపాలెం కనకదుర్గమ్మ, దేశమ్మ అమ్మవార్ల జాతరలో, మాట్లంలో మొగదారమ్మ, మహాలక్ష్మమ్మ జాతర వేడుకల్లోను ఆయన పాల్గొని, పూజలు నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, పిన్నెంటి రత్తయ్య, డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, కూనసాని



పెడనలో శోభాయాత్ర ప్రారంభిస్తున్న రాధామనోహర్‌దాస్

హనుమాన్ శోభాయాత్ర

అవనిగడ్డ : దివిసీమ వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ ప్రముఖ్ కమ్మలి సుబ్రహ్మణ్యేశ్వరరావు, సహ ప్రముఖ్ అన్నపరెడ్డి కృష్ణ, గరికపాటి వీరాంజనేయులు, అర్జా ఏడుకొండలు, జి.వి.నగరాయులు, కోలా శ్రీమన్నారాయణ, బచ్చు శ్రీహరి, లంకే యుగంధర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర జరిగింది. జీలగలగండి ఆంజనేయస్వామి ఆలయం నుంచి చల్లపల్లి బస్టాండ్ సెంటరులోని పంచముఖ అభయాంజనేయ స్వామి దేవాలయం వరకూ శోభాయాత్ర సాగింది. జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, అడపా రవి, వీహెచ్‌పి నేతలు శోభాయాత్రను పర్యవేక్షించగా, చల్లపల్లి ఎస్సై పిఎస్ వి.సుబ్రహ్మణ్యం బందోబస్తు చేపట్టారు. ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ, జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు. **పెడన :** పిండివారిపాలెంలోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద హిందూసేన ఫౌండర్, మత ప్రచార రాష్ట్ర కార్యదర్శి రాధామనోహర దాస్ జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. సీఐ కె. నాగేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఎస్సై జి. సత్యనారాయణ బందోబస్తు ఏర్పాటు చేశారు.



అర్తమూరులో పూజలు చేస్తున్న కాగిత రవికుమార్



అడ్డపర్ర వేడుకల్లో పాల్గొన్న కాగిత కృష్ణప్రసాద్



శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెండి తమలపాకుల మాల

గాంధీనగరంలో అభయాంజనేయ స్వామి ఆలయానికి రూ.60 వేలు విలువ చేసే వెండి తమలపాకుల మాలను దాసరి కృష్ణ, నాగరాణి దంపతులు సమర్పించారు.

దివిసీమ ఖ్యాతిని నలుదిశలా చాటిన వేటూరి

అవనిగడ్డ, మే 22 (ఆంధ్రజ్యోతి) : దివిసీమకు ఖ్యాతిని వేటూరి సుందరామ్మూర్తి నలుదిశలా చాటారని నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు అన్నపరెడ్డి వెంకటస్వామి అన్నారు. గాంధీక్షేత్రం సభా వేదికపై వేటూరి వర్థంతి సందర్భంగా స్వర నీరాజనం నిర్వహించారు. ప్రముఖ గాయకులు, దివిసీమ లలిత కళాసమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్ వేటూరి పాటలు ఆలపించి అంజలి ఘటించారు. వేటూరి చిత్రపటానికి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజనాల వీరబాబు, కర్రసాము అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సింహాద్రి పవన్, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, నీటి సంఘం అధ్యక్షుడు రేపల్లె రవీంద్ర, కూటమి నాయకులు యలవర్తి రాజ నాగమునేశ్వరరావు (చిన్నా), గరికపాటి శ్రీనివాసరావు, కొండవీటి పాండురంగారావు, కాగిత రామారావు, గరికపాటి హరిబాబు, కొట్టె విజయ్, రేపల్లె మాధవ, గాలం శ్రీను, అకాడమీ నిర్వాహకులు ఈశ్వర్, విశ్వ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో అధ్యక్షుడు యాసం చిట్టిబాబు తదితరులు వేటూరి చిత్రపటానికి నివాళులర్పించారు. గుగ్గిలం శ్యాం కుమార్, అడపా వెంకటేశ్వరరావు, విశ్వనాథుని మురళీమోహన్, దాసినేని సాంబయ్య, కొండవీటి మధు, బర్రంకుల శ్రీనివాసరావు, నారేపాలెం శ్రీరామకృష్ణ, అన్నపరెడ్డి రాందాస్, మొగల్ మురాద్ బేగ్, కోడూరు వెంకటేశ్వరరావు, బొర్రా బాలకృష్ణ, గరికపాటి శ్రీనివాసరావు, చందన నరసింహారావు, ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), తుంగల మధు పాల్గొన్నారు.



వేటూరికి నివాళులర్పిస్తున్న అన్నపరెడ్డి వెంకట స్వామి తదితరులు

ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్

(రిజిస్టర్డ్ అండర్ ఏ.పి. మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ యాక్టు 1995) Regd.No.431
ప్రధాన కార్యాలయము : 3వ లైను, బ్రాడీపేట, గుంటూరు-522002.ఫోన్ : (0863) 2354847

మహాజన సభ నోటీసు

ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్,గుంటూరు యొక్క 75 వ మహాజన సభ ఈ దిగువ అంశములు చర్చించి తీర్మానించుటకు గాను ది.15-06-2025 వ తేదీ ఆదివారము ఉదయం 09.00 గంటలకు అమరావతి రోడ్డు లో గల "A కన్వెన్షన్" (హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసి ఎదురుగా), గుంటూరు నందు జరుపబడును. కావున ఈ మహాజన సభకు బ్యాంకు నందు గల "A" తరగతి సభ్యులందరూ హాజరు కావలసినదిగా అభ్యర్థించు చున్నాము. ఆ రోజు కోరము కాని యెడల ఈ మహాజన సభ ది.22-06-2025 ఆదివారము ఉదయం 09.00 గంటలకు ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, 3వ లైను, బ్రాడీపేట, గుంటూరు నందు జరుపబడును.

అంశములు

1) 2024-25వ ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన పరిపాలనా నివేదికను ఆమోదించుటకు.
2) 2024-25వ ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి మెస్సర్స్ కుందా అసోసియేట్స్, ఛార్టర్డ్ అకౌంటెంట్స్ వారిచే ఇవ్వబడిన బ్యాలెన్స్ షీట్, లాభ నష్టముల ఖాతా మరియు ఆర్థిక నివేదికను ఆమోదించుటకు.
3) 2024-25 వ ఆర్థిక సంవత్సరమునకు ఆమోదించిన బడ్జెట్ కన్నా అయిన అదనపు ఖర్చులు ఆమోదించుటకు.
4) 2024-25 వ ఆర్థిక సంవత్సరమునకు నికర లాభము ను బ్యాంకు బైలా ప్రకారం కేటాయింపులు చేయుటకు.
5) 2025-26 వ ఆర్థిక సంవత్సరమునకు బ్యాంకు అంచనా బడ్జెట్ ను ఆమోదించుటకు.
6) 2025-26 వ ఆర్థిక సంవత్సరమునకు బ్యాంకు స్టాట్యూటరీ ఆడిట్ చేయుటకు గాను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వారు ఆమోదించిన చార్టర్డ్ అకౌంటెంట్ ఫరం ను నియమించుచూ వారి రెమ్యూనరేషన్ ఫిక్స్ చేయుటకు.
7) షేర్ హోల్డర్ లకు డివిడెండ్ చెల్లింపును ఆమోదించుట కొరకు
8) 2024-25 ఆర్థిక సంవత్సరములో సభ్యులకు మూడు సంవత్సరముల కాల పరిమితికి ముందు షేర్ కాపిటల్ (మూల ధనము) ను వాపసు చేసిన నిర్ణయమును ఆమోదించుటకు
9) ప్రస్తుతము అమలులో ఉన్న బైలా నెంబర్ లు 3,10(ఎ) మరియు 43(సి)మార్పు చేయుట గురించి
10) ప్రస్తుతము చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ I/C గా నియమితులై ఉన్న శ్రీ నన్నెబోయిన సంజీవరావు గారికి నెలకు రూ.1.10 లక్షల రెమ్యూనరేషన్‌తో ప్రతి సంవత్సరమునకు పది శాతము పెంపుదలతో మూడు సంవత్సరముల కాలమునకు నియమించినందున వారి నియామకమును రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాకు చేసిన రికమండేషన్‌ను ఆమోదించుచూ మరియు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వారి అనుమతి వచ్చు వరకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ I/C గా కొనసాగించుటకు చేసిన రికమండేషన్ ఆమోదించుట గురించి
11) చైర్మన్ గారి అనుమతితో ప్రవేశపెట్టబడు ఇతర విషయములు

పాలకవర్గము వారి అనుమతితో

(గమనిక : సభ్యుల ప్రవేశము ఆధార్ కార్డు, మరి ఏదేని ఇతర గుర్తింపు కార్డుతో మాత్రమే మహాజన సభకు అనుమతించబడును).

బ్రాడీపేట, గుంటూరు
తేది : 23-05-2025

నన్నెబోయిన సంజీవరావు
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ I/C

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235085

WANTED

» మచిలీపట్నం, బైపాస్‌రోడ్ లోని కృష్ణవేణి ITI కాలేజీలో పనిచేయుటకు B.Tech ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ / మెకానికల్ / కంప్యూటర్ సైన్స్ చదివిన వారు కావలెను. కాలేజి ఆవరణలో ఉచిత వసతి కలదు. 98486 79360
AJB - 225935

PLOTS FOR SALE

» విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్‌కు 12 కి.మీ., ప్రపోజ్డ్ ఇన్నర్‌రింగ్ రోడ్‌కు 8 Km, ప్రపోజ్డ్ ఔటర్ రింగ్ రోడ్‌కి 4 Km, దూరంలో ప్రపోజ్డ్ 4 లైన్స్ రోడ్డు ప్రక్కన CRDA LAYOUT ప్లాట్లు కలవు. సంప్ర:70978 98989
AJB- 235116

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 220/- కలర్ 30% EXTRA GST 5%
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464 తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737





వ్యవసాయ పరికరాల పంపిణీ

మచిలీపట్నం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం రుద్రవరం గ్రామ పంచాయతీలో ముగ్గురు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేశారు. రుద్రవరం రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో కొణతం రాధాకృష్ణ, వేమూరి శైలజ, దేవనబోయిన వెంకటరత్నంలకు టిల్లర్లు పంపిణీ చేశారు. నీలం రమేష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికను మంజూరు చేయాలని వినతి

నాగాయలంక, మే 22 (ఆంధ్రజ్యోతి) : టి.కొత్తపాలెంలో క్రైస్తవులకు శ్మశాన వాటికను మం జూరు చేయాలని కోరుతూ కె.నరసింహారావు, ఏ.గోపి, బి.సురేష్, ఏ.ఏసురాజు తదితరులు గురువారం తహసీల్దార్ ఎం.హరనాథ్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. శ్మశాన భూమి లేక నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు 26న

నాగాయలంక, మే 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా నాగాయలంక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం, నిర్ధారణ పరీక్షలను మణిపాల్ హాస్పటల్ వైద్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు మండలి అభిమానులు తెలిపారు. అదే రోజున మండల రెడ్‌క్రాస్ అధ్యక్షుడు భోగాది శివవిష్ణు వర్ధన్ అధ్యక్షతన నాగాయలంక రెడ్ క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు.

విజయ అమలేశ్వరికి పూజలు

పెడన రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : దావోజీపాలెం విజయ అమలేశ్వరిదేవి ఆలయంలో 11 సంవత్సరాలకు ఒకసారి జరిగే వేడుక గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకెం వారి వంశీయులు 11 రోజులపాటు అమ్మవారికి పూజలు నిర్వహించనున్నారు. అంకెం వారి వంశీయులు, ఆడపడుచులు దేశ విదేశాల నుంచి హాజరు కానున్నారని విజయ అమలేశ్వరి దేవి ఏకాదశి క్రతువు కమిటీ సభ్యులు తెలిపారు.

గేట్ల నిర్మాణానికి పరిశీలన

కోడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మందపాకల గ్రామం నుంచి చింతకోళ్ల వెళ్లే మార్గంలో డ్రైనేజీపై గేట్ల నిర్మాణం చేసేందుకు అవసరం ఉన్న ప్రదేశాన్ని డ్రైనేజీ అధికారులు గురువారం పరిశీలించారు. డ్రైనేజీ డీఈ బాబు నాయక్, ఏఈ కరీమ్, చిరంజీవి పాల్గొన్నారు.



బీసీల సంక్షేమానికి ప్రాధాన్యం

నాగాయలంక, మే 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర అగ్నికుల క్షత్రియుల వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మత్స్య భవనం వద్ద నిర్వహించిన అగ్నికుల క్షత్రియుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. మత్స్యకారుల సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, లంకే శ్రీనివాస ప్రసాద్, నాగిడి తాతారావు పాల్గొన్నారు.

డివైడర్ ఏర్పాటుకు పరిశీలన

గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద రెండో డివైడర్ ఏర్పాటు చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాథ్ కోరారు. ఈ మేరకు గురువారం నేషనల్ హైవే అథారిటీ అధికారి రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద డివైడర్ ఏర్పాటు గురించి త్రినాథ్‌తో పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

మహిళకు ఆర్థిక సాయం

పెడన, మే 22 (ఆంధ్రజ్యోతి) : గుండెజబ్బుతో బాధపడుతున్న పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన బోదాసు అనూషకు మేమున్నాం సేవా సంస్థ శుక్రవారం తహసీల్దార్ కె. అనిల్‌కుమార్ చేతుల మీదుగా రూ. 10వేల ఆర్థిక సాయం అందించింది. వీణం శ్రీనివాస్, సింగరాజు ప్రకాశరావు, సాయిబాబు, పట్టిసపు పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

1 నుంచి డిపోల వద్దే రేషన్

కోడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీను నాయక్ ఆదేశించారు.

